నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 13-11-2019 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి:26 సంచిక: 92 పేజీలు: 4 వెల: రూ.1/-

నడిరోడ్డుపై తన్నుకున్న ఖాకీలు

ముంబయి,నవంబర్ 12 : నడిరోడ్డుపై అందరూ చూస్తుండగా ఇద్దరు పోలీసులు తన్నుకున్నారు. గల్లా పట్టుకుని కొట్టుకున్నారు. ఈ ఘటన మహారాష్ట్రలోని భాంద్రా పట్టణంలో చోటు చేసుకుంది. భాంద్రాలోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద పోలీసులు విధుల్లో ఉన్నారు. వీరిలో ఇద్దరు పోలీసులు ఉన్నట్టుండి కొట్టుకున్నారు. షూతో దాడి చేసుకున్నారు. అంతటితో ఆగకుండా గల్లాలు పట్టుకుని ఆవేశానికి లోనయ్యారు. ఒక పోలీసు అయితే అక్కడున్న రాయిని మరో పోలీసుపైకి వేసేందుకు ప్రయత్నించడంతో.. ఓ వ్యక్తి వచ్చి అడ్డుకున్నాడు. అయితే అడ్డుకున్న ఆ వ్యక్తిపై మరో పోలీసు చేయి చేసుకున్నాడు. మొత్తానికి ఈ ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు కూడా ఎలాంటి చర్య తీసుకోలేదు. గొడవపడ్డ పోలీసులను విష్ణు ఖేడికేర్, వికాస్ గైక్వాడ్‌గా గుర్తించారు.

మహారాష్ట్రలో రాష్ట్రపతి పాలన

కేంద్ర క్యాబినేట్ ఆమోదం

సుప్రీంకోర్టును ఆశ్రయించిన శివసేన

ముంబయి,నవంబర్12 (ఆర్ఎన్ఎ) : మహారాష్ట్రలో రాష్ట్రపతి పాలనకు కేంద్రం ఆమోదం తెలిపింది. గవర్నర్ భగత్ సింగ్ కోష్యారి సిఫార్సుకు అనుగుణంగా ఆ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనకు మంగళవారం మధ్యాహ్నం జరిగిన కేంద్ర క్యాబినెట్ భేటీలో నిర్ణయం తీసుకున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మహారాష్ట్రలో ఏ పార్టీకి ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమై సంఖ్యా బలం లేనందున గవర్నర్ సిఫార్సును పరిగణనలోకి తీసుకుని కేంద్ర క్యాబినెట్ రాష్ట్రపతి పాలనకు ప్రతిపాదించింది. మహారాష్ట్ర అసెంబ్లీలో బీజేపీ ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించినా ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 145 స్థానాల మేజిక్ ఫిగర్‌కు చాలా దూరంలో నిలవడంతో ప్రభుత్వ ఏర్పాటుకు ఆసక్తి కనబరచలేదు. మరోవైపు రెండో అతిపెద్ద పార్టీగా శివసేనను గవర్నర్ ఆహ్వానించినా..డెడ్‌లైన్‌లోగా బలనిరూపణ చేయలేదు. డెడ్‌లైన్ పొడిగించాలన్న శివసేన వినతిని గవర్నర్ తోసిపుచ్చారు. ఇక మూడో అతిపెద్ద పార్టీ ఎన్సీపీని మంగళవారం రాత్రి 8.30 గంటల్లోగా బలనిరూపణ చేసుకోవాలని కోరుతూ ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానం అందింది. ఈ దిశగా ఎన్సీపీ.. కాంగ్రెస్, శివసేనలతో సంప్రదింపులు జరుపుతుండగానే రాష్ట్రపతి పాలనకు గవర్నర్ సిఫార్సు చేయడం, ఇందుకు కేంద్ర క్యాబినెట్ ఆమోద ముద్ర వేయడంపై విపక్షాలు విస్మయం వ్యక్తం చేశాయి.

ఇదిలాఉంటే, క్షణక్షణానికి మలుపులు తిరుగుతున్న మహారాష్ట్ర రాజకీయం ఇప్పుడు సుప్రీంకోర్టుకు చేరింది. ప్రభుత్వ ఏర్పాటు అవసరమైన మద్దతు కూడగట్టుకునేందుకు అదనపు గడువు కోరితే గవర్నర్ తిరస్కరించారని శివసేన సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. గవర్నర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ప్రభుత్వ ఏర్పాటుపై వైఖరి తెలియజేసేందుకు బిజెపికి మూడు రోజులు గడువు ఇచ్చిన గవర్నర్ తమకు మాత్రం 24 గంటలు మాత్రమే ఇచ్చారంటూ శివసేన తన పిటిషన్‌లో పేర్కొంది. ఈ పిటిషన్‌ను అత్యవసరంగా మంగళవారం నాడే విచారణ చేపట్టాలని న్యాయస్థానాన్ని కోరింది.

బంగ్లాదేశ్‌లో రెండు రైళ్లు ఢీ..

15మంది మృతి

పలువురికి గాయాలు

ఢాకా, నవంబర్12(ఆర్ఎన్ఎ) : బంగ్లాదేశ్‌లో మంగళవారం తెల్లవారుజామున ఘోరరైలు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 15 మంది ప్రయాణికులు మరణించారు. బంగ్లాదేశ్‌లోని బ్రహ్మాన్ బరియాలోని మండోభాగ్ రైల్వేజంక్షన్ లో మంగళవారం తెల్లవారుజామున 3గంటలకు రెండు రైళు ఢీకొన్నాయి. ఉద్యాన్ ఎక్స్‌ప్రెస్సు ఢాకా నుంచి వస్తున్న రైలు ఢీకొనడంతో 12 మంది ప్రయాణికులు అక్కడికక్కడే మరణించారు. మరో ముగ్గురిని ఆసుపత్రికి తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటనలో పలువురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని బ్రహ్మాన్ బరియా జనరల్ ఆసుపత్రి, కుమిల్లా సదర్ ఆసుపత్రులకు తరలించారు. ప్రమాదానికి గురైన రైలు బోగీలను రైల్వే సిబ్బంది తొలగిస్తున్నారు. ప్రభుత్వం ఈ ఘటనపై విచారణకు ఆదేశించింది. చిట్టగాంగ్ వైపునకు వెళ్తున్న రైలు.. ఢాకా వెళ్తున్న మరో రైలు ఎదురెదురుగా ఢీకొనడం ఇంతటి ప్రమాదం సంభవించిందని అధికారులు చెప్తున్నారు. ఇప్పటి వరకు 15 మృత దేహాల్ని స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. మృతుల సంఖ్య పెరగొచ్చని అన్నారు. క్షతగాత్రులను ఆస్పత్రుల్లో చేర్పించామని, వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. ఒక్కసారిగా భారీ శబ్దంతో ప్రమాదం జరగిందని, రైలు ముందు భాగాలు తునాతునకలు అయిందని ఓ ప్రయాణికుడు చెప్పారు. క్షతగాత్రుల ఆ ప్రాంతమంతా హాహాకారాలతో నిండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇక అధ్వాన స్థితిలో ఉన్న ట్రాక్‌లు, పర్యవేక్షణ సరిగా లేని క్రాసింగ్‌ల మూలంగా బంగ్లాదేశ్ రైలు ప్రమాదాలు తరచూ జరుగుతుండటం బాధాకరం.

కార్తీక పూర్ణమి సందర్భంగా నదులలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు.

రాజధాని అభివృద్ధి ప్రాజెక్టు నుంచి తప్పుకున్న సింగపూర్

అమరావతి,నవంబర్12 (ఆర్ఎన్ఎ) : రాజధానిలోని స్టార్టప్ ప్రాంత అభివృద్ధి ప్రాజెక్టు నుంచి వైదొలగుతున్నట్లు సింగపూర్ ప్రకటించింది. ఏపీ ప్రభుత్వం, సింగపూర్ కన్సార్షియం పరస్పర అంగీకారంతో ఈ ప్రాజెక్టు నుంచి తాము వైదొలగుతున్నట్లు సింగపూర్ మంత్రి ఈశ్వరన్ ప్రకటించారు. స్టార్టప్ ప్రాంత అభివృద్ధిపై కొన్ని ఇబ్బందులు తలెత్తిన నేపథ్యంలో ప్రాజెక్టును నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం రాత్రి ఏపీ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో సింగపూర్ ప్రభుత్వం నుంచి మంగళవారం అధికారిక ప్రకటన వెలువడింది. రాజధాని ప్రాంతంలో దాదాపు 1691 ఎకరాల్లో స్టార్టప్ ప్రాజెక్టును చేపట్టాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై 2017లో ఒప్పందం కుదిరింది. అయితే ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకోవడం వల్ల తమ పెట్టుబడులపై ఎలాంటి ప్రభావం ఉండదని మంత్రి ఈశ్వరన్ స్పష్టం చేశారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో సింగపూర్ కంపెనీ పెట్టుబడులపై దీని ప్రభావం ఏమాత్రం ఉండబోదని ప్రకటనలో ఆయన వెల్లడించారు.

చరిత్రలో నేటినిజం

కం॥ సినిమా పాటలు పాడుచు
మన మనసుల దోచు కొనిన మానిత మహిళా
మణి యైన పి. సుశీలకు
జనవంద్యుండగు భవుడిడు సకలశుభంబులే!!

(నవంబర్ 13 పి. సుశీల పుట్టిన రోజు..)

-రాధశ్రీ
సెల్: 9494481210

కోర్టు రూంలో కాల్పులు..ఇద్దరు లాయర్లు మృతి

బ్యాంకాక్,నవంబర్ 12: కోర్టు రూంలో ఆగంతకుడు జరిపిన కాల్పుల్లో ఇద్దరు లాయర్లు మృతి చెందారు. ఈ ఘటన థాయ్‌లోని చందబురి ప్రావిన్షియల్ కోర్టులో జరిగింది. ఓ వారసత్వ ఆస్తి వివాదానికి సంబంధించి కోర్టు రూంలో విచారణ జరుగుతుండగా ఈ ఘటన జరగడం గమనార్హం. విచారణ జరుగుతున్న సమయంలో ఆగంతకుడు వచ్చి కాల్పులు జరిపాడు. ఆగంతకుడి చేతిలో ఇద్దరు లాయర్లు ప్రాణాలు కోల్పోగా..పోలీసులు ప్రతిఘటించి దుండగుడిని చంపినట్లు పోలీస్ ఉన్నతాధికారి క్రిస్సానా పట్టణ చరోయిన్ తెలిపారు. విచారణ జరిగే కోర్టు రూంలో కాల్పులు జరిపే పరిస్థితి ఎందుకు వచ్చిందనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



సరయూ నదిలో పుణ్యస్నానాలు

రామ్‌లీలా దర్శనానికి పోటెత్తిన భక్తులు

లక్నో,నవంబర్12(ఆర్ఎన్ఎ): దేశ వ్యాప్తంగా కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం ఆలయాల వద్ద భక్తులు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అయోధ్యలోని సరయూ నదిలో భక్తులు మంగళవారం ఉదయం పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. వేలాది మంది భక్తులు దీపాలు వెలిగిస్తున్నారు. ఇక రాష్ట్రంలోని ఆలయాల వద్ద వేకువజాము నుంచే భక్తులు పూజలు చేస్తున్నారు. ఉత్తరాదిలోఉన్న అనేక నదుల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి.. కార్తీక దీపాలను నదిలో వదులుతున్నారు. కొన్ని ఆలయాల్లో అయితే సత్యనారాయణ స్వామి వ్రతాలు చేస్తున్నారు.

నేడు మినీ జాబ్ మేళా

హైదరాబాద్,నవంబర్12 (ఆర్ఎన్ఎ): మల్లేపల్లి బాలుర ఐటీఐ క్యాంపస్‌లోని ఉపాధి కల్పనశాఖ కార్యాలయంలో బుధవారం మినీ జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎన్. లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. ఇన్నోవ్‌స్టోర్స్, కాలిబహెచ్ఆర్, సువర్ణభూమి డెవల పర్స్, పేరం గ్రూపుల్లో 280 ఉద్యోగాల భర్తీకి ఈ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామన్నారు. ఎంపికైన వారికి రూ. 10 వేల నుంచి 18 వేల వరకు వేతనంగా లభిస్తుందన్నారు. ఇతర వివరాల కోసం టి. రఘువతి యంగ్ ప్రొఫెషనల్ 8227656356 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

హైదరాబాద్,నవంబర్12 (ఆర్ఎన్ఎ): మలక్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ముసారాంబాగ్ చౌరస్తాలో మంగళవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ద్విచక్రవాహనం అదుపు తప్పిపడిపోవడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. బైక్ నుంచి కిందపడగానే హెల్మెట్ పగిలిపోయింది. దీంతో తలకు బలమైన గాయాలు కావడంతో ఘటనా స్థలంలోనే దుర్మరణం చెందాడు. రోడ్డు రక్తపుటేరులుగా మారిపోయింది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు. ట్రాఫిక్ జామ్ కు అంతరాయం కలగకుండా మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. హెల్మెట్ ఉన్న ప్రాణం పోయిందని ప్రత్యక్షసాక్షులు బాధను వ్యక్తం చేశారు. ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

ఘోర రోడ్డు ప్రమాదం.. ఏడుగురు మృతి

జైపూర్,నవంబర్12(ఆర్ఎన్ఎ): రాజస్థాన్‌లోని బికనీర్‌లో మంగళవారం ఉదయం ఘోర రోడ్డుప్రమాదం చోటు చేసుకుంది. దేశ్నోక్ వద్ద కారు, ట్రక్కు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఏడుగురు ఘటనాస్థలిలోనే చనిపోయారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారి పరిస్థితి విషమంగా ఉండడంతో సమీప ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలిలో పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. అతివేగం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. బాధితుల వివరాలు తెలియరాలేదు. పోస్టుమార్టం కోసం మృతదేహాలను ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

తెలుగు రాష్ట్రాల్లో కార్తీక పౌర్ణమిశోభ

- భక్తులతో పోటెత్తిన శైవక్షేత్రాలు

హైదరాబాద్, నవంబర్12(ఆర్ఎన్ఎ) : తెలుగు రాష్ట్రాల్లో కార్తీక పౌర్ణమి సందడి

నెలకొంది. మంగళవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. తెల్లవారుజామునే పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఆలయాల్లో బారులు తీరారు.

శివనామస్మరణతో దేవాలయాలు మార్మోగుతున్నాయి. వేములవాడ రాజరాజేశ్వర ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి దీపాలు వెలిగిస్తున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా పలు ఆలయాల్లో అధికారులు అభిషేకాలు రద్దుచేశారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం వశిష్ట గోదావరి తీరంలో భక్తుల రద్దీ నెలకొంది. వలందర్ ఘాట్, అమరేశ్వర ఘాట్ లలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం దుర్గా లక్ష్మణేశ్వరస్వామికి పంచామృతభిషేకం నిర్వహిస్తున్నారు. నరసాపురం కపిలమల్లేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. భద్రాచలంలోని గోదావరి నది దగ్గర భక్తుల రద్దీ పెరిగింది. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని తెల్లవారుజాము నుంచే భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. వేకువజామునే గోదావరిలో కార్తీక దీపాలు వదిలారు. పంచారామ క్షేత్రాలైన పాలకొల్లు శ్రీక్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయం, భీమవరం సోమేశ్వరాలయం, పట్టిసీమ వీరభద్రస్వామి ఆలయం, ద్వారకాతిరుమల మల్లికార్జున స్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పట్టిసీమ, కొవ్వూరు, నరసాపురంలో గోదావరిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. సూర్యాపేట జిల్లాలోని మట్టపల్లి శివాలయం, మేళ్లచెర్వు స్వయంభూ మల్లికార్జున స్వామి ఆలయం, బూరుగడ్డ శివాలయం, పిల్లలమర్రి శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

లోకో పైలట్ చంద్రశేఖర్ పరిస్థితి విషమం

- శరీరంలో ఇంటర్నల్ బ్లీడింగ్.. సర్జరీ నిర్వహించిన వైద్యులు

- కాచిగూడ మీదుగా వెళ్లాల్సిన పలురైళ్లు రద్దు

హైదరాబాద్, నవంబర్12(ఆర్ఎన్ఎ) : కాచిగూడ రైలు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఎంఎంటీఎస్ లోకో పైలట్ చంద్రశేఖర్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. రెండు రైళ్ల మధ్యలో చిక్కుకున్న చంద్రశేఖర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడ్ని దాదాపు 8గంటలకుపైగా శ్రమించి రెస్క్యూటీం కాపాడింది. చికిత్స నిమిత్తం కేర్ ఆసుపత్రికి తరలించింది. పరీక్షలు నిర్వహించిన వైద్యులు చంద్రశేఖర్‌కు తీవ్రగాయాలయ్యాయని తెలిపారు. అతడి రెండుకాళ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని చెప్పారు. శరీరంలో ఇంటర్నల్ బ్లీడింగ్ జరుగుతుందని కేర్ ఆసుపత్రి వైద్యులు ప్రకటించారు. కాగా ఉదయం 11గంటల సమయంలో చంద్రశేఖర్‌కు సర్జరీ ప్రారంభించారు. ఇదిలా ఉంటే కాచిగూడ స్టేషన్‌లో సోమవారం రెండు రైళ్లు ఢీకొనడంతో దెబ్బతిన్న ట్రాక్ మరమ్మతు పనులు వేగంగా సాగుతున్నాయి. 3వందల మంది సిబ్బందితో ట్రాక్, కేబులింగ్ వ్యవస్థను సరి చేస్తున్నారు. ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ శాఖలు సంయుక్తంగా పనులు నిర్వహిస్తున్నాయి. 3వందల మంది ఈ పనుల్లో నిమగ్నమయ్యారు. పనులు మరికాస్త సమయం పట్టే అవకాశం ఉండటంతో మంగళవారం కాచీగూడ మీదుగా నడవాల్సిన రైళ్లను దక్షిణమధ్య రైల్వే తాత్కాలికంగా రద్దు చేసింది. దెబ్బతిన్న రెండు రైల్ ఇంజన్లను యార్డ్‌కు తరలించారు. మరమ్మతు పనులు పూర్తయ్యాక పరీక్షలు నిర్వహించి ఆ తర్వాత

రైళ్ల రాకపోకలకు అవకాశం ఇస్తారు. ఒకే ట్రాక్‌పై రెండు రైళ్లు ఢీకొన్న ఘటనలో 14మంది గాయపడ్డారు. వీరిలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అందరికీ.. ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. గాయపడ్డవారిలో ఇద్దరు మహిళలు ఉన్నారు. అన్ని విభాగాల డాక్టర్లు.. అందుబాటులో ఉండి క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్నారు. ప్రమాదంతో.. నగరవాసులు భయభ్రాంతులకు గురయ్యారు. ప్రమాదం విషయం తెలిసిన 10 నిమిషాల్లోపే.. రైల్వే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే.. సహాయచర్యలు ప్రారంభించి.. గాయపడ్డవారిని దగ్గరిలోని ఆస్పత్రికి తరలించారు. తర్వాత.. ఫలక్‌నుమా నుంచి కాచిగూడకు వచ్చే రైళ్ల రాకపోకలను అధికారులు నిలిపేశారు.

తాలిబన్ ఖైదీలను విడుదల చేయనున్న అఫ్ఘనిస్తాన్

కాబూల్,నవంబర్ 12: హై ర్యాంకింగ్ హోదాలో ఉన్న ముగ్గురు తాలిబన్ ఖైదీలను విడుదల చేయనున్నట్లు అఫ్ఘనిస్తాన్ అధ్యక్షుడు అష్రఫ్ ఘని తెలిపారు. తాలిబన్ తీవ్రవాదులు 2016లో ఇద్దరు ప్రొఫెసర్లను కిడ్నాప్ చేసింది. ఈ ఘటనతో అఫ్ఘన్ ప్రభుత్వం ముగ్గురు తాలిబన్ ఉగ్రవాదులను అరెస్ట్ చేశారు.

అష్రఫ్ ఘని మీడియా సమావేశంలో మాట్లాడుతూ..అంతర్జాతీయ భద్రతాదళాల సాయంతో దేశ సరిహద్దుల్లో అరెస్ట్ చేసిన ముగ్గురు ఉగ్రవాదులను బేషరతుగా విడుదల చేయనున్నట్లు చెప్పారు. అయితే తాలిబన్ల కస్టడీలో ఉన్న ఇద్దరు ప్రొఫెసర్ల ఆరోగ్యపరిస్థితి, ఇతర అంశాల గురించి ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. ప్రొఫెసర్లలో ఒకరు ఆస్ట్రేలియాకు చెందినవారు కాగా..మరొకరు అమెరికా వ్యక్తి.

ఉసిరి, తులసి అత్యంత ప్రత్యేకత...!

నేటినిజం
బుధవారం 13-11-2019

ఒకప్పుడు భారత దేశంలో ప్రతి జంతువూ మానవులతో సమానంగా తిరుగుతూ ఉండేవి. మనిషి కూడా వాటితో కలిసి బతికేవాడు. ఆవును దేవతా స్వరూపంగా భావించి ఈ దేశ సంస్కృతిలో భాగమైన తులసి, ఉసిరి, మామిడి, రావి, మారేడు, జమ్మివంటి వృక్షజాతులను సైతం పూజించడం ఆచారమైంది. మన పండుగలు, సంబరాలు ఈ ఆచారాలను, వ్యవహారాలను పదేపదే గుర్తుచేయడానికి అన్నట్లుగా ఉంటాయి. పెద్దలు కూడా ప్రతి జంతువుని, ప్రతి చెట్టూ, పుట్టా, అన్నింటినీ మనం పలకరించేవిధంగా విధివిధానాలు రూపొందించారు. అన్నింటిలాగే కార్తీకంలో వచ్చే క్షీరాబ్ధి ద్వాదశి పర్వదినం ఒకటి. ప్రత్యేకంగా, తులసి చెట్టుకు, ఉసిరి చెట్టుకు ఈ మాసంలో అత్యంత ప్రత్యేకత ఉంటుంది. కార్తీక శుద్ధ ఏకాదశిని ప్రభోదనా ఏకాదశి అంటారు. ఆ రోజు శ్రీ మహావిష్ణువు పాలకడలిపై పవళింపును చాలించి, తులసివనానికి చేరుకుంటాడట. బ్రహ్మాది దేవతలు సైతం ఆయనతో పాటు కదిలివచ్చి తులసి వనంలో కొలువుంటారట. మరునాడు ద్వాదశి నాడు క్షీరాబ్ధి ద్వాదశి భావనతో దీప దానాలు చేసి క్షీరాబ్ధిశయన వ్రతం ఆచరించాలని వ్రత గ్రంథాలు సూచిస్తున్నాయి. శ్రీకృష్ణునికి ఎంతో ఇష్టమైన ప్రదేశాలు మూడు. భక్తుల హృదయాలు, తపస్సుల సన్నిధానం. మూడోది తన ప్రియురాలైన తులసితో కలిసి ఉండటం. ఈ విషయాలని ఆధారంగా చేసుకుని క్షీరాబ్ధిద్వాదశి నాడు తులసి వివాహ పర్వాన్ని తలుచుకోవడం ఆనవాయితీగా మారింది. నూతన వస్త్రాలు, గాజులు, పసుపుకుంకుమ తులసిమొక్కను అలంకరించి పూజించడం ఎంతో శుభఫలితాలను ఇస్తుందని శాస్త్రం తెలియజేస్తుంది.

తులసి ఉసిరి ఒకేచోట పుట్టాయని శివపురాణంలోని ఒక కథ వివరాలలోకి వెళితే కాలనేమి కుమార్తె వృంద అనే పేరుతో పద్మపురాణంలో బృందగా కనిపిస్తుంది. ఆమె జలంధరుడి భార్య. ఆమె పాతివ్రత్యాన్ని పరీక్షించడానికి విష్ణుమూర్తి జలంధరుడి రూపంలో వృందను సమీపిస్తాడు. భర్తగా పొరబడి విష్ణువును గాఢంగా ఆలింగనం చేసుకుంటుంది. ఆ పిదప వాస్తవాన్ని గ్రహించి అవమాన భారంతో తన దేహాన్ని అగ్నికి ఆహుతి చేసుకుంటుంది. చితిలో దగ్ధమవుతూ ఆమె "నన్నిలా నా భర్తనుండి దూరం చేసిన మూలంగా నీవూ నీ భార్యకు దూరమై చిరకాలం దుఃఖాన్ని అనుభవించి చివరకు కోతుల సాయంతో ఆమెను దక్కించుకుందువు గాక" అనే విష్ణువును శపిస్తుంది. ఆమె చితాభస్మం భూమిలో కలిసిపోయిన చోటులోనే తులసి ఉసిరి మొక్కలు మొలిచాయని శివపురాణం చెబుతుంది. ఈ కారణంగా ఆ రెండింటినీ పవిత్రమైన వృక్షాలుగా భావిస్తారు. కార్తీకమాసమంతా చేయకున్నా కనీసం క్షీరాబ్ధి ద్వాదశి నాడయినా ఆ రెండింటినీ ఆరాధించాలని పెద్దలు నిర్దేశించడం వెనుక ఎన్నో అంతరార్థాలు రహస్యాలు ఇమిడి ఉంటాయని అంటారు. అవి తెలిసి చేసినా, తెలియక చేసినా ఆరాధనల వల్ల ఆయురారోగ్యాలు శుభాలు చేకూరుతాయని పెద్దల వాక్యం. పెద్దల మాట ఏదయినా శుభమే కదా? ఆచరిద్దామా?

సావంత్ రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం

– ప్రకాశ్ జావడేకర్‌కు బాధ్యతలు

న్యూఢిల్లీ, నవంబర్12(ఆర్ఎన్ఎ) : శివసేన ఎంపీ అరవింద్ సావంత్ కేంద్రమంత్రి పదవికి చేసిన రాజీనామాను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ మంగళవారం ఆమోదించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సలహా మేరకు సావంత్ రాజీనామాను తక్షణమే ఆమోదించినట్లు రాష్ట్రపతి భవన్ అధికార ప్రతినిధి వెల్లడించారు. ఇప్పటివరకు సావంత్ చేపట్టిన భారీ పరిశ్రమలు, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖను కేంద్రమంత్రి ప్రకాశ్ జావడేకర్‌కు అప్పగించారు. మహారాష్ట్రలో శివసేన ప్రభుత్వం ఏర్పాటుకు మద్దతిచ్చే అంశాన్ని పరిశీలించాలంటే ఎన్డీయేతో తెగతెంపులు చేసుకోవాలని ఎన్‌సీపీ షరతు విధించింది. దీంతో కేంద్ర కేబినెట్‌లో శివసేనకు చెందిన ఏకైక మంత్రి అరవింద్ సావంత్ సోమవారం రాజీనామా చేసిన విషయం తెలిసిందే. భాజపా ఇచ్చిన మాట మీద నిలబడలేదని, ఎన్నికల ముందు అంగీకరించిన 50-50 సూత్రాన్ని అనుసరించకుండా సేన గౌరవాన్ని దెబ్బతీసిందని సావంత్ ఆ సందర్భంగా ఆరోపణలు చేశారు.

మరోవైపు మరాఠా రాజకీయాలు రసకందాయంలో పడ్డాయి. ఎన్‌సీపీ, కాంగ్రెస్‌ల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి శివసేన చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో ప్రభుత్వ ఏర్పాటుకు మరింత గడువు కావాలని సేన నేతలు కోరగా.. గవర్నర్ అందుకు అంగీకరించలేదు. అంతేగాక.. మెజార్టీ పరంగా శివసేన తర్వాతి స్థానంలో ఉన్న ఎన్‌సీపీని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించారు. మంగళవారం రాత్రి 8.30 గంటల వరకు సమయమిచ్చారు. దీంతో ఏం జరగబోతోందన్నది ఆసక్తికరంగా మారింది.

తగ్గిన పత్తి దిగుబడులు

ఆందోళనలో రైతులు

ఆదిలాబాద్,నవంబర్12(ఆర్ఎన్ఎ): పత్తి రైతులను ప్రతికూల వాతావరణం వెంటాడుతుంది. ఈ సీజన్ ప్రారంభంలో అనుకూలవాతావరణ పరిస్థితులే ఉన్నా.. పూతకాత దశకు వచ్చేసరికి అధిక వర్షాలతో నష్టం వాటిల్లింది. పూత కాత రాలిపోయింది. తలమడుగు, తాంసీ, జైనథ్, బేల, ఆదిలాబాద్ మండలాల్లో గులాబీ పురుగు ఆశించిడంతో పూత దశలోనే మాడిపోయింది. పిందెలకు కూడా రంధ్రాలు చేయడంతో పనికి రాకుండాపోయింది. దీంతో దిగుబడులపైన రైతులు తీవ్ర నష్టాల బారినపడ్డారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులకు తోడు గులాబీరంగు పురుగు ఆశించడంతో దెబ్బమీద దెబ్బతో కోలుకోలేకపోతున్నారు. సగానికి సగం దిగుబడులు తగ్గిపోవడంతో అన్నదాతల అంచనాలు తారుమారయ్యాయి. వీటికి తోడు మార్కెట్‌లో వ్యాపారుల మాయాజాలం కారణంగా కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి అందని దుస్థితి నెలకొంది. పత్తి పంటకు ప్రత్యామ్నాయంగా సోయా పంటను సాగు చేయాలని ప్రభుత్వ ప్రచారంతో సాగు విస్తీర్ణం తగ్గింది. పత్తి సాగు చేసిన పత్తి రైతులు ప్రస్తుతం తీవ్ర నష్టాలను చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతానికి హెక్టారుకు పది క్వింటాళ్లు కూడా దిగుబడి రావడంలేదు. దీంతో అన్నదాతల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతుంది. పత్తి పంట దిగుబడులు తగ్గిపోవడంతో మార్కెట్లకు వచ్చే పంట కూడా తగ్గిపోయింది. గతేడాది ఇదే సమయానికి మార్కెట్లకు భారీగా పత్తి దిగుబడి వచ్చింది. కానీ.. ఈసారి ఆ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ఇప్పటి వరకు ఆదిలాబాద్ జిల్లాలోని అయిదు మార్కెట్ యార్డులో వచ్చిన పత్తిన చూస్తే దిగుబడులుఎలా ఉన్నాయో తెలిసిపోతోంది. ఈ మొత్తం పత్తిని ప్రైవేటు వ్యాపారులే కొనుగోలు చేశారు. ఇప్పటి వరకు ప్రతికూల వాతావరణ పరిస్థితులు వెంటాడినా ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండటంతో దిగుబడులు ఆశించిన స్థాయిలో ఉంటాయనే ఎదురుచూస్తున్నారు. నీటి వసరులున్న చోట రైతులకు దిగుబడులు వచ్చే అవకాశం ఉంది. సెప్టెంబర్‌లో ఎడతెరిపిలేకుండా కురిసిన భారీ వర్షానికి ఉన్న పూత, కాత రాలిపోయింది. దీంతో అప్పటి నుంచి పత్తికి పూత, కాత లేకుండాపోయింది. ఎకరానికి పది నుంచి పన్నెండు క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని అనుకుంటే నాలుగు క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి లేకుండాపోయింది.

యాదాద్రిలో కార్తీక శోభ

–సత్యనారాయణ వ్రతాలకు భక్తుల రాక

యాదాద్రి భువనగిరి,నవంబర్12(ఆర్ఎన్ఎ): యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో కార్తీకమాసం వేడుకలు ఘనంగా నిర్వహించారు. పౌర్ణమి కావడంతో శ్రీ సత్యనారాయణస్వామి వ్రతాల నిర్వహణకు భక్తులు పోటెత్తారు. ఈమాసం ఎంతో విశేషం కావడంతో ఇక్కడ నిత్యం వ్రతాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. యాదాద్రి నరసింహుడి జన్మనక్షత్రం స్వాతిరోజు నుంచే కార్తీకమాసం వేడుకలు మొదలయ్యాయి. పౌర్ణమి కావడంతో వేదమంత్ర పఠనాల మధ్య ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకం నిర్వహించే పూజారులు గర్భాలయంలోని స్వయంభువులకు కూడా అభిషేకం నిర్వహించారు. రాష్ట్రంలో ప్రసిద్ధిచెందిన ఈ క్షేత్రంలో శ్రీ సత్యనారాయణస్వామి వ్రతాలు అధికంగా కొనసాగాయి. శ్రీ నారసింహుడిని దర్శించిన భక్తులకు శివాలయ సందర్శన కలగడం మరో విశేషం. అన్నవరం ఆలయం తరువాత ఇక్కడే వ్రతాలు అధిక సంఖ్యలో కొనసాగుతాయి. ఆ విశిష్టతగల యాదాద్రిలో రోజూ నాలుగుమార్లు కొనసాగుతున్న ఆ పూజల సదుపాయాన్ని కార్తీకమాసంలో ఆరుదఫాలుగా నిర్వహించేందుకు శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నిర్ణయించింది. ఆలయ సందర్శన, వ్రతాల నిర్వహణ కోసం భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. కార్తీక మాసంలో ఆలయాలను సందర్శించి వ్రతాలు నిర్వహించడం శుభదాయకమని పండితులు, పూజారులు చెబుతున్నారు. ఆలయ విస్తరణ పర్వంలోనూ గతంలో కొనసాగిన మండపాలలోనే వ్రతాల నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టారు.

రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు

–నడుం బిగించిన పాలకవర్గాలు

నిజామాబాద్,నవంబర్12(ఆర్ఎన్ఎ): మార్కెటింగ్ అధికారులు ధాన్యం కొనుగోళ్లకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలులో రైతులకు నష్టం జరగకుండా గిట్టుబాటు ధర దక్కేలా చూడాలని కలెక్టర్ ఆదేశించడంతో కమిటీ పాలకవర్గాలు నడుం బిగించాయి. మధ్య దళారులను పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని అన్నారు. రైతులకు నష్టం లేకుండా కొనుగోళ్లు చేస్తామని వ్యవసాయ శాఖ జెడి తెలిపారు. వరి ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులను ఇబ్బందులు పెట్టకూడదని రైసు మిల్లర్లు, కమీషన్ ఏజెంట్లను మంత్రి ఆదేశించడంతో ఆయా మార్కెట్లకు ఆదేవ్యాలు అందాయి. బీపీటీ వరి రకానికి బహిరంగ మార్కెట్లో ధర తగ్గించి కొనుగోలు చేయటం సరికాదన్నారు. ధర తగ్గించటం వెనుక దళారుల పాత్ర ఉందన్నారు. నీళ్ల సమృద్ధిగా ఉన్నందున రబీలో కూడా పంటలు విస్తారంగా సాగవుతాయన్నారు. రైసు మిల్లర్ల సమస్యలు కూడా పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో రైతులకు కావాల్సిన సేవలను అందించాలని నూతన పాలకవర్గం సభ్యులకు, అధికారులకు సూచించారు. రైతులు పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు ధరలు వచ్చేలా కొనుగోలు జరిపేలా చర్యలు తీసుకుంటామన్నారు. రైతుబందు పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. మార్కెట్ ఫీజు సక్రమంగా వసూలు చేసి ఆదాయాన్ని పెంపొందించాలని సిబ్బందికి ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు మార్కెట్ కమిటీల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

విజృంభిస్తున్న గున్యా

హైదరాబాద్, నవంబర్ 12:మరోమారు చికెన్ గున్యాతో పాటు విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. పెద్దా చిన్నా తేడా లఅఏకుండా కీళ్ల నొప్పులు, ఒళ్లు నొప్పులు, తీవ్ర జ్వరాలతో జనం మంచం పడుతున్నారు. నగరాలతో పాటు పట్టణాలు, గ్రామాల్లో ఆస్పత్రుల్లో పెద్ద సంఖ్యలో ఆస్పత్రుల్లో చేరుతున్నారు. మారిన వాతావరణంతో పాటు దోమల విజృంభణ కాఱణంగా జ్వరాలు వస్తున్నాయని వైద్యులు తెలిపారు. పట్టణాల్లో పారిశుద్ధయం పెద్ద సమస్యగా మారింది. విచ్చలవిడిగా అపరిశుభ్ర పరిస్థితులు కారణంగా దోమలు విజృంభిస్తున్నాయి. ఫాగింగ్ యంత్రాల ద్వారా పొగవెదజల్లు తున్నా దోమల విజృంభణ ఆగడం లేదు. నగరాల్లో పారిశుద్యం నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం లేకపోవడంతో వీధులన్నీ చెత్త కుండీల్లాగా తయారయ్యాయి. దీంతో దోమలు విజృంభించి నగరాల్లో ప్రాణాంతక డెంగీ, మలేరియా,చికెన్న్ గున్యా కేసులు నమోదవుతున్నాయి. దోమల నివారణకు వ్యక్తిగతంగా కూడా ప్రజలు ఎవరికి వారు చర్యలు చేపడుతున్నా వాటి ఉత్పత్తి తగ్గడం లేదు. దోమల నివారణకు పురపాలక సిబ్బంది రసాయనాలతో పిచికారి చేస్తున్నారు. ఫాగింగ్ చేస్తున్నారు. అయినా వాటి ప్రభావానికి దోమలు మాత్రం పెద్దగా చావడం లేదని జ్వరాల కేసులను చూస్తుంటే అర్థం అవుతోంది. రోజువారీ గణాంకాల ప్రకారం ఎపిలో వ్యాధిగ్రస్తులు ఎక్కువగా ఉంటున్న ప్రాంతాల్లో గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం నగరాలు అగ్రభాగన ఉండటం విశేషం. తెలంగాణలో పల్లెలు పట్టణాలు అన్న తేడా లేకుండా అంతటా జ్వరపీడితులు దర్శనమిస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులు కూడా బాధితులతో కిటకిటలాడుతున్నాయి. మొత్తం మీద జ్వర బాధితులతో రాష్ట్రాలు మంచాన పడ్డాయి. సకాలంలో చికిత్స అందే పరిస్థితులు లేక చిన్నచిన్న జబ్బులే ప్రాణాలు తోడేసే దుస్థితి నెలకొంది. ఒకట్రెండు రోజుల్లో నయమయ్యే వ్యాధులు కూడా వారాల తరబడి వేధిస్తున్నాయి. జ్వరపీడి తుల్లో మలేరియా,డెంగీ, చికెన్ గున్యా కేసులు నమోదైనట్లు సమాచారం. ప్రాథమిక రక్త పరీక్షలకు నోచక రాజధాని ప్రాంత ప్రభుత్వాసుపత్రుల అఘోరిస్తున్నాయి. ఇక మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. మలేరియా, డెంగీ జ్వరాలు సీజనల్‌గా వచ్చే సాధారణ వ్యాధులే మినహా ప్రాణాలు తీసే జబ్బులు కాదు. కానీ సకాలంలో చికిత్స చేయించుకునే పరిస్థితులు లేకపోవడంతో సామాన్యుల పాలిట తలకుమించిన భారమౌతున్నాయి. దోమల నిర్మూలన మందులకు జిహెచ్ఎంసి ఒక్కటే ఏటా రూ.5 కోట్ల నుంచి 7 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నా ఫలితం లేకపోతోంది. నివారణ చర్యలు, అవగాహన కార్యక్రమాలతో ఫలితం లేకపోగా.. రోజురోజుకూ దోమ కారక వ్యాధుల తీవ్రత పెరుగుతోంది. ప్రస్తుత మందుల వల్ల దోమల నివారణ సాధ్యపడడం లేదన్నది నిజం. ప్రస్తుతం దోమల ఉత్పత్తి, ఉధృతి తగ్గించేందుకు రకరకాల రసాయనాలు వాడుతున్నారు. దోమలు చనిపోయేలా ఫాగింగ్ నిర్వహిస్తున్నారు. అయినా.. ఆశించిన ఫలితం లేదు. దోమలు తగ్గకపోగా క్రమేణా వృద్ధి చెందుతున్నాయి.

వర్షాకాలంతోపాటు వేసవిలోనూ దోమలు దాడి చేస్తున్నాయి. దీంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. దోమల ఉధృతి పెరగడం వల్లే ఈ వ్యాధుల వ్యాప్తి, నిర్ణీత స్థాయిలో రసాయనాలు కలపకపోవడం వల్లే యాంటీ లార్వా ఆపరేషన్ ఫలించడం

లేదని అధికారులూ అంగీకరిస్తున్నారు. దీంతో వాడుతోన్న రసాయనాలు దోమలపై పని చేస్తున్నాయా..? లేదా..? అన్నది అనుమానాలకు తావిస్తోంది. తాము వాడుతున్న రసాయనాలు సక్రమంగా పని చేయడం లేదన్న విషయం జీహెచ్ఎంసీ అధికారులు కూడా అంగీకరిస్తున్నారు. రసాయనాలు సక్రమంగా పని చేయడం లేదని తేలితే తదుపరి ఏం చర్యలు తీసుకోవాలన్న దాని పై నిపుణుల సలహాలు తీసుకోవాలని భావిస్తున్నారు. దీంతో చాలాచోట్ల చికెన్ గున్యాతో ప్రజలు డాక్టర్ల వద్ద వాపోతున్నారు. నడవలేక పోతున్నామని అంటున్నారు. అయితే ఈ జ్వరాలపై సర్కార్ లెక్కలు తప్పుతున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

మంత్రుల లెక్కలు తప్పా లేక, మంచాన పడ్డవారి లెక్క తప్పా? లేక దోమల తప్పా అన్నది తెలియడం లేదు. మొత్తానికి తెలుగురాష్ట్రాల్లో జ్వరపీడితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. సర్కార్ దవాఖానాలు తెల్ల మొహం వేస్తున్నాయి. ప్రైవేట్ దవాఖానాలు పీల్చి పిప్పి చేస్తున్నాయి. ఒక్క దోమ కారణంగా లక్షల రూపాయలు గుల్ల అవుతున్నాయని వాపోతున్నారు. అయినా ప్రభుత్వాలు మాత్రం దీనిని పెద్ద సీరియస్‌గా తీసుకోవడం లేదు. జ్వరాలపై అనవసర గాభరా వద్దన్నారు. కానీ ఆస్పత్రుల్లో చేరిన వారిని గాభరా పడొద్దని ఎలా అనగలమో ఆలోచించాలి. క్షేత్రస్థాయిలో బాధితుల సంఖ్య ప్రభుత్వ గణాంకాల కంటే అధికంగా ఉంటుంది. వాస్తవానికి సీజనల్ వ్యాధులు రాకుండా ముందుగానే తగిన నివారణ చర్యలు తీసుకుంటే పరిస్థితి మరోవిధంగా ఉండేది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు , పంచాయితీలు, పట్టణ, నగర పాలక సంస్థల ప్రధాన విధుల్లో ముఖ్యమైనది ప్రజారోగ్య సంరక్షణెళి. కానీ ఇప్పుడు జరుగు తున్నదేమిటి? వ్యాధులు రాకుండా సకాలంలో టీకాలు వేయడం, మందు బిళ్లలు పంపిణీ చేయడం వంటి ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాల్సిన పిహెచ్‌సిలు ఆ పని చేయకపోగా కనీసం వ్యాధి వచ్చిన తర్వాత వెళితే చేతులెత్తేస్తున్నాయి.

ఏజెన్సీలో దోమల విజృంభణ

జ్వరాలకు తోడు పారిశుధ్య సమస్యలు

ఆస్పత్రులకు వెళ్లాలంటేనే భయం

ఆదిలాబాద్,నవంబర్12(ఆర్ఎన్ఎ): పల్లెలు మొదలు పట్టణాల వరకు అపరిశుభ్ర వాతావరణంలో తల్లడిల్లు తున్నాయి. ఇక పంచాయితీలు, పురపాలికలు దోమల నివారణకు చేపడుతున్న కార్యక్రమాలు ప్రచారానికి పరిమిత మౌతున్నాయే తప్ప పురోగతి సాధించిందేమీ లేదు. ఏజెన్సీ ప్రాంతాల్లో దోమల దాడి తీవ్రంగా ఉంది. దోమల నివారణకు పారిశుద్యం ప్రధాన కారణంగా చూడాలి.అసలు జబ్బు కంటే దాని చికిత్స కోసమయ్యే వైద్య ఖర్చులే పేదలకు ప్రాణసంకటంగా మారుతున్నాయి. ఆస్పత్రులకు వెళ్లిన వారికి రక్తపరీక్షలు, ప్లేట్ లెట్స్ తక్కువ పేరుతో పీడనకు గురవుతున్నారు. చికిత్స చేసయకుంటే ఏమవువ ్రతుందో అన్న ఆందోళనలో ఖర్చుకు వెనకాడడం లేదు. కరువు కోరల్లో చిక్కుకున్న ప్రాంతాల్లో అన్నదాతల ఆత్మహత్యలకు వైద్య ఖర్చులు కూడా కారణమని అనేక నివేదికల్లో వెల్లడైంది. ప్రజారోగ్యం బాధ్యత నుంచి క్రమంగా తప్పు కుంటున్న ప్రభుత్వాలు ఆరోగ్య శ్రీ వంటి పథకాల పేరుతో కార్పొరేట్ వైద్య సంస్థలకు కానులు కురిపిస్తున్నారు. ఈ డబ్బుతో ప్రభుత్వ ఆస్తప్రులను అభివృద్ధి చేయాల్సి ఉన్నా ఆ వైపు చూడడం లేదు. ప్రభుత్వ వైద్యాన్ని విస్తరించడం లేదా బలోపేతం చేసేందుకు నిధులు వెచ్చించడం లేదు. ప్రభుత్వం ఆరోగ్య శ్రీ పేరుతో మరింతగా విస్తరింపజేసేందుకు యత్నిస్తోంది. దీంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు దినదినం నీరుగారు తున్నాయి. కనీసం పారాసిటమల్ టాబ్లెట్ కూడా దొరకని దుర్భర పరిస్థితికి చేరుకుంటున్నాయి. సూపర్ స్పెషాలిటి ప్రభుత్వాసుపత్రుల్లో అత్యాధునిక పరీక్షలకు నోచడం లేదు. అన్నింటా ప్రయివేటు సంస్థలకు భాగస్వామ్యం కల్పించి ప్రజారోగ్య రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారు. పాలకులు ఇప్పటికైనా యుద్ధ ప్రాతిపదికన జ్వరాల నివారణకు చర్యలు తీసుకోవాలి. ఏజెన్సీల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలి. అంటువ్యాధులు ప్రబలే సీజన్‌కు ముందుగానే యాక్షన్ ప్లాన్ రూపొందించి వ్యాధులు విజృంభించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి. ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే రాష్ట్రం ఆరోగ్యంగా ఉంటుందని గుర్తించి ప్రజారోగ్యానికి పెద్దపీట వేయాలి. జ్వరాలకు తక్షణ చికిత్సలు అందించాలి. ఎక్కడిక్కడ వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజల జేబులు గుల్లకాకుండా ఆదుకోవాలి. ఇప్పటికే రాష్ట్ర బ్జడెట్‌లో వైద్యారోగ్య రంగానికి కేటాయించే నిధులన్నీ ఆరోగ్య శ్రీ బిల్లులకే సరిపోయిన పరిస్థితులు చూస్తున్నాం. అందులో కొంతయినా ప్రభుత్వ ఆస్పత్రులకు కేటాయించాలి. ప్రజల ప్రాథమిక హక్కులైన విద్య, వైద్యం వంటి రంగాల్లో ప్రయివేటు జోక్యాన్ని తగ్గించి ప్రభుత్వ పాత్రను పెంచాలి.అలాగే క్షేత్రస్థాయిలో పిహెచ్‌సిలను బలోపేతం చేస్తూ పోవాలి. అప్పుడే వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకునే అవకాశం ఏర్పడుతుంది.

భూ సమస్యల పరిష్కారంలో విఫలం

పలు ప్రాంతాల్లో రైతుల ఆత్మహత్య యత్నం

నిజామాబాద్,నవంబర్12(ఆర్ఎన్ఎ): తెలంగాణలో పలు జిల్లాలోని రైతులు భూ సమస్యలను తీర్చాలంటూ కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాల ముందు రైతులు ఆత్మహత్య యత్నానికి పాల్పడుతున్నారు. నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఓ రైతు ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరింపులకు దిగిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. దర్పల్లి మండలంలోని దుబ్బాక గ్రామానికి చెందిన అంకం గంగాధర్ అనే రైతు చె÷-టటెక్కి ఆత్మహత్య చేసుకుంటానంటూ సోమవారం కలెక్టరెట్ ముందు బెదిరింపులకు దిగాడు. దీంతో ఓ పోలీసు అధికారి చెట్టెక్కి తాడు లాగి రైతును కిందకు దించారు. కాగా అన్నదమ్ముల మధ్య జరుగుతున్న బోరు సమస్యను దర్పల్లి మండలం ఎమ్మార్వోకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా కూడా పట్టించుకోవడం లేదని అందుకే ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు రైతు తెలిపాడు. ఇప్పటికైనా బోరు సమస్యను తక్షణమే పరిష్కారించాలని రైతు కోరాడు. బోధన్ ఆర్డీవో కార్యాలయంలో ఓ మహిళా రైతు ఆత్మహత్యా యత్నం చేసింది. త్గగెళ్ళి గ్రామానికి చెందిన అబ్బవ్వ అనే మహిళా రైతు తన డిజిటల్ పట్టా పాస్‌బుక్ కోసం ఏడాదిగా బోధన్ రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతోంది. అయినా వారు పట్టించుకోవడం లేదంటూ ఇవాళ కార్యాలయం ముందు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. దీంతో పోలీసులు ఆమెను అడ్డుకుని విచారించగా తన భూమిని ఇతరుల పేరు మీదకు మార్చారని ఆవేదన వ్యక్తం చేసింది. అలాగే జనగామ జిల్లాలోని లింగాల గణపురం మండలం గమ్మడవెల్లి గ్రామానికి చెందిన చెంగిర్ల వెంకటేష్ అనే రైతు ఎకరం భూమిని తన పేరు మీదకు పట్టా చేయడం లేదంటూ ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. దీంతో స్థానికులు అతనిని అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు రైతును స్టేషన్‌కు తరలించారు. ఈ మూడు సంఘటనలు తెలంగాణలో కలకలం రేపుతున్నాయి.

పబ్‌లకు కేరళ సర్కార్ పచ్చ జెండా?

తిరువనంతపురం, నవంబర్11(ఆర్ఎన్ఎ): కేరళలో పబ్‌లను ప్రారంభించే విషయాన్ని పరిశీలిస్తానని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రకటించారు. 'వారం వారం నామ్ మునూట్టు' అనే టీవీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి విజయన్ ఈ ప్రకటన చేశారు. ఉద్యోగులకు వారాంతంలో ఆటవిడుపుగా ఉండేందుకు పబ్‌లను ప్రారంభించే యోచన ఉన్నట్లు ఆయన తెలిపారు.

పబ్బులు లేకపోవడంతో చాలా మంది విమర్శిస్తున్నారని, ఈ విషయాన్ని కేరళ ప్రభుత్వం తీవ్రంగా పరిశీలిస్తోందని విజయన్ తెలిపారు. ఐటి రంగంతోపాటు ఆ తరహా పరిశ్రమలలో పనిచేస్తున్న ఉద్యోగులకు వారమంతా పనిచేసిన తర్వాత వారాంతపు సెలవులు ఎలా గడపాలో తెలియడం లేదంటూ చాలా ఫిర్యాదులు వస్తున్నాయని, ఈ సమస్యను ప్రభుత్వం పరిష్కరించేందుకు ప్రయత్నిస్తుందని ఆయన చెప్పారు. మరింత మెరుగైన సౌకర్యాలను కల్పించేందుకు కేరళ బెవరేజెస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడిచే మద్యం షాపులలో మార్పులు తీసుకువచ్చే విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని ఆయన తెలిపారు.

వైన్ షాపుల ముందు ప్రజలు బారులుతీరి నిలబడకుండా సూపర్ మార్కెట్ తరహాలో వైన్ షాపులను నెలకొల్పే విషయాన్ని పరిశీలిస్తున్నామని, కస్టమర్లు తమకు నచ్చిన మద్యాన్ని ఈ షాపులలో ఎంపిక చేసుకోవచ్చని ఆయన చెప్పారు.

శ్రీశైలంలో పోటెత్తిన భక్తులు

శ్రీశైలం,నవంబర్12(ఆర్ఎన్ఎ): కార్తీక పౌర్ణమితో శ్రీశైల మహాక్షేత్రంలో భక్తులు పోటెత్తారు. ప్రత్యేక అభిషేకాలు, లక్ష ఒత్తుల వెలిగింపు వంటి కార్యక్రమాలు చేపట్టారు. వరుసగా రెండోరోజూ భక్తుల రద్దీ కొనసాగింది. సోమవారం తెల్లవారే పౌర్ణమి రావడంతో ఉదయాన్నే భక్తులు పాతాళగంగ చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో అభిషేకాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయంలో కార్తీక మాసోత్సవాలకు తోడు పౌర్ణమి కావడంతో అభిషేకాలు నిర్వహించారు. భ్రమరాంబ మల్లికార్జునుల దర్శనానికి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఆలయ అధికారులు వేకువజాము నుంచే దర్శనానికి అనుమతించారు. పాతాళగంగలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, కార్తీకదీపాలను వెలిగించారు. అనంతరం మల్లన్న దర్శనానికి వెళ్లారు. క్యూ కంపార్ట్‌మెంట్లు నిండుగా కనిపించాయి. సాయంత్రం పుష్కరిణి వద్ద లక్ష దీపోత్సవం నిర్వహించి దశవిధ హారతులు పట్టారు. క్యూ కాంప్లెక్స్‌లో పాలు, అల్పాహారం, మంచినీటిని అందించారు. శివదీక్షా శిబిరాల వద్ద వనభోజనాలు ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు ప్రత్యేక పూజలు, సుప్రభాత సేవ, మహా మంగళహారతి సేవలను రద్దు చేశారు. గర్భాలయ అభిషేకాలు, సామూ

రామమందిర నిర్మాణానికి కసరత్తు!

– మకర సంక్రాంతిరోజున భూమిపూజ?
– ఏర్పాట్లు చేస్తున్న యూపీ ప్రభుత్వం

న్యూఢిల్లీ, నవంబర్12(ఆర్ఎన్ఎ) : సుప్రీంకోర్టు తీర్పుతో అయోధ్యలోని వివాదస్పద స్థలంలో రామమందిర నిర్మాణానికి ఆటంకాలు తొలగిపోయాయి. దీంతో ఆలయ నిర్మాణం ఎప్పుడు ప్రారంభిస్తారనే చర్చ తీవ్రంగా జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆలయన నిర్మాణానికి వచ్చే ఏడాది జనవరిలో భూమిపూజ నిర్వహిస్తారనే ప్రచారం సాగుతోంది. జనవరిలో మకర సంక్రాంతి రోజున భారీ ఎత్తున ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలుస్తోంది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అయోధ్య ట్రస్ట్‌ను త్వరగా ఏర్పాటుచేసి, అందరి సహకారంతో నిర్మాణాన్ని వేగంగా పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు విశ్వసనీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఆలయ నిర్మాణ పనులు ప్రారంభానికి సంక్రాంతి శుభముహూర్తంగా భావిస్తోన్న ప్రభుత్వం.. ఆలోగా అన్ని పక్రియలను పూర్తిచేయనుందని ఓ ఉన్నతాధికారి వెల్లడించారు. అంతేకాదు, 2022 యూపీ ఎన్నికల నాటికి ఆలయాన్ని దాదాపు పూర్తిచేస్తారని ఆయన తెలిపారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ అధ్యక్ష బాధ్యతలను నిర్వహిస్తున్న గోరక్ష్ పీఠ్ ముఖ్య లక్ష్యమైన మందిర్ ప్రాజెక్ట్ కోసం అన్ని పనులను ఉపసంహరించుకోవడం ఖాయమని అన్నారు. మరోవైపు, సుప్రీంకోర్టు తీర్పును కేంద్రం త్వరగా అమలుచేయాలని, గతంలో తమ ఆర్కిటెక్ట్ చంద్రకాంత్ సోంపుర రూపొందించిన నమూనా ప్రకారం మందిర నిర్మాణం చేయాలని వీహెచ్‌పీ డిమాండ్ చేస్తోంది. మందిర నిర్మాణంపై 1989లో వీహెచ్‌పీ చీఫ్ అశోక్ సింఘాల్ ఆదేశాలతో ప్రముఖ శిల్పి సొంపుర ఈ నమునాను రూపొందించారని, దేశవ్యాప్తంగా ఇది ప్రాచుర్యం పొందిందని ఆ సంస్థ వర్కింగ్ ప్రెసిడెంట్ అలోక్ కుమార్ వ్యాఖ్యానించారు. ఆ నమూనాకు అనుగుణంగా కొత్త ఆలయ నిర్మాణం జరుగుతుందని భావిస్తున్నామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

వీహెచ్‌పీ ఆఫీస్ బేరర్స్ ప్రకారం.. రాతి శిల్పాలు, భవనం స్తంభాల పనులు వేగంగా జరుగుతున్నాయని, వీటిని నిర్మాణానికి వినియోగించవచ్చనని తెలిపారు.

గాంధీ కుటుంబంపై ఆర్ఎస్ఎస్ కుట్ర

– పీఆర్సీ పేరుతో కేసీఆర్ మైండ్‌గేమ్ ఆడుతున్నాడు
– కాంగ్రెస్ సీనియర్ నేత వీ.హనుమంతరావు

హైదరాబాద్, నవంబర్12 (ఆంఎన్ఎ) : సోనియా గాంధీ, రాహుల్‌లకు ఎస్పీజీ భద్రతను కేంద్రం తొలగించడాన్ని ఖండిస్తున్నామని కాంగ్రెస్ సీనియర్ నేత వీ.హనుమంతరావు అన్నారు. సోమ వారం ఆయన విలేకరులతో మాట్లాడారు.. గాంధీ కుటుంబం లేకుండా చేయాలని ఆర్ఎస్ఎస్ కుట్ర చేస్తోందని విమర్శించారు. ఇందులో భాగంగా తాజాగా కేంద్ర ప్రభుత్వం ఎస్పీజీ భద్రతను తొలగించిందని అన్నారు. ఏన్నో ఏళ్లుగా ఉన్న భద్రతను ఇప్పుడు తొలగించడానికి కారణమేంటని ప్రశ్నిం చారు. కాంగ్రెస్ పార్టీ చనిపోయిందని అసద్ అనడం విచారకమన్నారు. బీజేపీని గెలిపించడానికి అసద్ మహారాష్ట్రకు వెళ్లి ప్రచారం చేశారన్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ తన సత్తాను చూపిందని, కాంగ్రెస్ మళ్లీపూర్వవైభవం తెచ్చుకుంటుందని వీహెచ్ తెలిపారు. దేశవ్యాప్తంగా బీజేపీ హవా తగ్గుతుందని, కాంగ్రెస్ హవా ప్రారంభమైందని అన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ సర్కార్ కార్మికుల పట్ల దుర్మార్గంగా వ్యవహరిసుందని అన్నారు. సీఎం కేసీఆర్ తన నియంత పాలనతో ఆర్టీసీ కార్మికులను ఇబ్బందులు పాలు చేస్తున్నారని వీహెచ్ మండిపడ్డారు. ఎన్ని ఆంక్షలు పెట్టినా ఆర్టీసీ కార్మికులు చలో ట్యాంక్‌బండ్‌ను సక్సెస్ చేశారని వీహెచ్ అన్నారు. పీఆర్సీ పేరుతో కేసీఆర్ మైండ్ గేమ్ ఆడుతున్నారని, టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక పని తక్కువ.. యాక్షన్ ఎక్కువ అయిందని వీహెచ్ ఎద్దేవా చేశారు.

సమస్యల పరిష్కారంకై..

రైతుల ఆత్మహత్య యత్నం

– కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాల ఎదుట ఆందోళన
– ఒకే రోజు మూడు ఘటనలు
– రెవెన్యూ అధికారులపై రైతుల్లో పెరుగుతున్న ఆక్రోశం

నిజామాబాద్, నవంబర్12(ఆర్ఎన్ఎ) : తన భూమిని రిజిస్ట్రేషన్ చేయాలేదనే కోపంతో అబ్దుల్లాపూర్‌మేట్ ఎమ్మార్వో విజయారెడ్డిని హత్య చేసిన ఘటన తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. తాజాగా తెలంగాణలో పలు జిల్లాలోని రైతులు భూ సమస్యలను తీర్చాలంటూ కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాల ఎదుట ఆత్మహత్య యత్నానికి పాల్పడుతున్నారు. నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఓ రైతు ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరింపులకు దిగిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. దర్పల్లి మండలంలోని దుబ్బాక గ్రామానికి చెందిన అంకం గంగాధర్ అనే రైతు చెట్టెక్కి ఆత్మహత్య చేసుకుంటానంటూ సోమవారం కలెక్టరెట్ ముందు బెదిరింపులకు దిగాడు. దీంతో ఓ పోలీసు అధికారి చెట్టెక్కి తాడులాగి రైతును కిందకు దించారు. కాగా అన్నదమ్ముల మధ్య జరుగుతున్న బోరు సమస్యను దర్పల్లి మండలం ఎమ్మార్వోకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినాకూడా పట్టించుకోవడం లేదని అందుకే ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు రైతు తెలిపాడు. ఇప్పటికైనా బోరు సమస్యను తక్షణమే పరిష్కరించాలని రైతు కోరాడు. అదేవిధంగా బోధన్ ఆర్డీవో కార్యాలయంలో ఓ మహిళా రైతు ఆత్మహత్యా యత్నం చేసింది. తగెళ్ళి గ్రామానికి చెందిన అబ్బవ్వ అనే మహిళా రైతు తన డిజిటల్ పట్టా పాస్‌బుక్ కోసం ఏడాదిగా బోధన్ రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతోంది. అయినా వారు పట్టించుకోవడం లేదంటూ సోమవారం కార్యాలయం ముందు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. దీంతో పోలీసులు ఆమెను అడ్డుకుని విచారించగా తన భూమిని ఇతరుల పేరు మీదకు మార్చారని ఆవేదన వ్యక్తం చేసింది. అదేవిధంగా జనగామ జిల్లాలోని లింగాల గణపురం మండలం గమ్మడవెల్లి గ్రామానికి చెందిన చెంగిర్ల వెంకటేష్ అనే రైతు ఎకరం భూమిని తన పేరు మీదకు పట్టా చేయడం లేదంటూ ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. దీంతో స్థానికులు అతనిని అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు రైతును స్టేషన్‌కు తరలించారు. ఈ మూడు సంఘటనలు తెలంగాణలో కలకలం రేపుతున్నాయి.

శబ్ద, వాయు కాలుష్యాలతో..

మహిళల్లో గర్భస్రావం

– వ్యక్తి దాఖలు చేసిన పిల్‌ను విచారించిన హైకోర్టు
– కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశం
– డిసెంబర్ 19కి విచారణ వాయిదా

హైదరాబాద్, నవంబర్12(ఆర్ఎన్ఎ) : నగరంలో నానాటికి పెరుగుతున్న శబ్ద, వాయు కాలుష్యాలతో ప్రజలు అనారోగ్యాల బారిన పడి తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారని తెలంగాణ హైకోర్టులో ఎమ్. ఆదిత్య అనే వ్యక్తి పిల్ దాఖలు చేశారు.

ఈ అంశంపై సోమవారం వాదనలు విన్న న్యాయస్థానం.. పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (పీసీబీ), మున్సిపల్ కమిషన్, తెలంగాణ డీజీపీ మహేందర్ రెడ్డితో సహా రాచకొండ, హైదరాబాద్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌లకు నోటీసులు జారీ చేసింది. అదేవిధంగా ప్రభుత్వానికి కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ హైకోర్టు.. తదుపరి విచారణను డిసెంబర్ 19కి వాయిదా వేసింది. వివరాల్లోకి వెళితే.. దేశంలో ఢిల్లీ తరువాత హైదరాబాద్ నగరంలో వాయు కాలుష్యం పెరిగే అవకాశం ఉందని, జంట నగరాల్లో పెరుగుతున్న వాహనాల కారణంగా శబ్ద, వాయు కాలుష్యం విపరీతంగా పెరిగిందని పిటిషనర్ తరపు న్యాయవాది రాపోలు భాస్కర్ వాదించారు. గ్రేటర్ హైదరాబాద్‌లో రోజురోజుకూ పెరుగుతున్న కాలుష్యంతో మహిళలు గర్భస్రావంతో సహా పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ హైకోర్టుకు విన్నవించారు. అలానే రాయల్ ఎన్‌ఫీల్డ్‌తో పాటు పలు ద్విచక్ర వాహనాల కారణంగా విపరీతమైన శబ్ద కాలుష్యం ఏర్పడుతుందని పిటిషనర్ తన నివేదికలో పేర్కొన్నారు. మరోవైపు సోమవారం మున్సిపల్ ఎన్నికల పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు.. తదుపరి విచారణను నవంబర్ 30న వాయిదా వేసింది. మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని జబ్బార్ అహ్మద్ అనే వ్యక్తి హైకోర్టులో రిట్ అప్పీల్ దాఖలు చేశారు.

జల్‌జీవన్ మిషన్ పథకాన్ని అమలు చేయండి

– కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్

న్యూఢిల్లీ, నవంబర్12(ఆర్ఎన్ఎ) : జల్‌జీవన్ మిషన్ పథకాన్ని యుద్ధప్రతిపదికన అమలు చేసేందుకు రాష్ట్రాలు, అధికారులు కృషి చేయాలని కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ అన్నారు. కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ సదస్సు సోమవారం జరిగింది. పథకం అమలుకు నిధులు ఇవ్వాలని అన్ని రాష్ట్రాలు కేంద్రాన్ని కోరాయి. గజేంద్రసింగ్ షెకావత్ మాట్లాడుతూ.. 2024 కల్లా జల్‌జీవన్ మిషన్ పథకాన్ని పూర్తి చేయాలని సూచించారు. పథకం నిధుల కోసం నాబార్డు, ఇతర ఆర్థిక సంస్థలను సంప్రదిస్తున్నామని వివరించారు. బ్జడెట్‌కు లోబడి రాష్ట్రాలకు నిధులు సమకూరుస్తున్నామని తెలిపారు. జలజీవన్ మిషన్‌లో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకం అని వివరించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఆర్థిక సహకారం అందిం చాలని తెలంగాణ సీఎస్ ఎస్‌కే జోషీ కోరారు. జల్‌జీవన్ కోసం ఖర్చు చేసే నిధులను జనాభా ప్రాతిపదికన రాష్ట్రాలకు ఇవ్వాలన్నారు. రాష్ట్రాలు రుణాలు తీసుకునే పరిమితిని పెంచాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

లోకో పైలెట్ తప్పిదం వల్లనే ప్రమాదం

– సిగ్నలింగ్ తప్పిదం ఏమీలేదు
– స్పష్టం చేసిన సౌత్ సెంట్రల్ రైల్వే సీపీఆర్వో రాకేశ్

హైదరాబాద్, నవంబర్12(ఆర్ఎన్ఎ) : కాచిగూడ రైలు ప్రమాదంలో సిగ్నలింగ్ తప్పులేదని, సిగ్నల్ ఇవ్వకుండానే లోకో పైలట్ ఎంఎంటీఎస్ రైలును ముందుకు తీసుకెళ్లాడని కాచిగూడ ప్రమాదంపై సౌత్ సెంట్రల్ రైల్వే సీపీఆర్వో రాకేశ్ తెలిపారు. సోమవారం కాచిగూడ రైల్వే ప్రమాదంలో పలువురికి తీవ్రగాయాలు అయిన విషయం విధితమే. ఈ ఘటనపై ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. కాచిగూడ ఎంఎంటీఎస్ రైలు ప్రమాదంపై ఏఐఎం బిబి పాటిల్ కూడా స్పందించారు. డ్రైవర్ తప్పిదం వల్లే ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. ఎక్స్‌ప్రెస్ రైలును ఢీ కొట్టడంతో ఎంఎంటీఎస్‌లోని 6 బోగీలు దెబ్బతిన్నాయని.. ప్రమాదంలో 12మంది ప్రయాణికులు గాయపడ్డారని వారు తెలిపారు. ప్రమాదంలో సిగ్నలింగ్ లోపం ఏమీలేదని, లింగంపల్లి నుంచి ఫలక్‌నుమా వెళ్లాల్సిన ఎంఎంటీఎస్ రైలు ప్లాట్‌ఫాం-2పైకి వచ్చిందన్నారు. అదే సమయంలో కర్నూలు నుంచి సికింద్రాబాద్ వెళ్లాల్సిన హంద్రీ ఎక్స్‌ప్రెస్ కాచిగూడ స్టేషన్‌ను సమీపించిందని, అప్పటికే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు నాలుగో ప్లాట్‌ఫామ్‌పై వేచి ఉందన్నారు. హంద్రీ ఎక్స్‌ప్రెస్‌కు ప్లాట్‌ఫామ్-3 కి సిగ్నల్ ఇచ్చామని, అదే సమయంలో ఎంఎంటీఎస్ రైలును లోకో పైలట్ ముందుకు తీసుకెళ్లాడని, దీంతో ప్రమాదం జరిగిందని సీ పీ ఆర్వో లోకేశ్ వివరించారు. ఎంఎంటీఎస్ రైలును ఎందుకు ముందుకు తీసుకెళ్లాల్సి వచ్చిందో లోకో పైలట్ చంద్రశేఖర్ మాత్రమే చెప్పాల్సి ఉందని రాకేశ్ వెల్లడించారు. రెండు రైళ్ల మధ్య ఇరుక్కున్న చంద్రశేఖర్ తీవ్రంగా గాయపడ్డారని, ప్రత్యేక పద్ధతుల్లో అతడికి ఆక్సిజన్ అందిస్తూ రెస్క్యూ ఆపరేషన్ కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ ఘటనతో లింగంపల్లి - ఫలక్‌నుమా మధ్య రాకపోకలు నిలిపివేసినట్లు ఆయన వెల్లడించారు. ఘటనపై ఉన్నత స్థాయి అధికారులతో సమగ్ర దర్యాప్తు చేయిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని కాచిగూడ రైల్వే స్టేషన్‌లో రెండు రైళ్లు ఢీకొన్న విషయం తెలిసిందే. స్టేషన్‌లో నిలిచి ఉన్న ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలును ఎంఎంటీఎస్ రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 20 మందికి పైగా ప్రయాణికులు గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను ఉస్మానియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

లోకో పైలట్ పరిస్థితి విషమం..

ప్రమాదంలో ఎంఎంటీఎస్ లోకో పైలట్ చంద్రశేఖర్ రెండు రైలు ఇంజన్ల మధ్య ఇరుక్కుపోయాడు. 5 గంటలకు పైగా నరకం అనుభవిస్తున్నాడు. గ్యాస్ కట్టర్ సాయంతో రైలు కేబిన్‌ను కత్తిరించి లోకో పైలట్‌ను బయటకు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. అతడు అపస్మారక స్థితికి చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. వైద్యుల సాయంతో రైల్వే, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది అతడికి ప్రత్యేక పద్ధతుల్లో ఆక్సిజన్ అందించి, సైలెన్లు ఎక్కించి బయటకు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. లోకో పైలట్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

గురుకులాలతో నాణ్యమైన విద్య

తెలంగాణ ఏర్పడ్డ తర్వాత రెట్టింపు చేసిన సిఎం కెసిర్
సకల సౌకర్యాలతో నాణ్యమైన విద్యకు శ్రీకారం
మంత్రి సత్యవతి రాథోడ్

కామారెడ్డి,నవంబర్12(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో పేద వర్గాలకు కూడా నాణ్యమైన విద్య అందించే గురుకుల విద్యాలయాలు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మానస పుత్రికలని రాష్ట్ర గిరిజన సంక్షేమం, స్త్రీ-శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. గతంలో ఎప్పుడూ జరగని రీతిలో రాష్ట్రంలో గిరిజన సంక్షేమం ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో జరుగుతోందన్నారు. కామారెడ్డి జిల్లా నర్సుల్లాబాద్‌లో 4.20 కోట్ల రూపాయలతో నిర్మించిన గిరిజన గురుకుల విద్యాలయం ప్రారంభోత్సవంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, రోడ్లు, భవనాలు, శాసనసభ వ్యవహారాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి ప్రశాంత్ రెడ్డితో పాటు సత్యవతి రాథోడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్యవతి మాట్లాడుతూ..గత 70 ఏళ్లలో ఎన్ని గురుకులాలు నిర్మించారో, తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని గురుకులాలను నిర్మించడంతో ఈరోజు అవి రెట్టింపు అయ్యాయని చెప్పారు. రెసిడెన్షియల్ విద్యాలయాల్లో నేడు ఒక్కో విద్యార్థిపై లక్షా 20వేల రూపాయలను ఖర్చు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. విద్య ద్వారానే

అట్టడుగున ఉన్న గిరిజనులు అభివృద్ధి చెందుతారని నమ్మి, ఈరోజు పెద్ద ఎత్తున గిరిజన గురుకులాలు తీసుకొస్తున్నారని తెలిపారు. అంతే కాకుండా ముఖ్యంగా గిరిజనుల సంక్షేమానికి ఎక్కువగా పాటుపడుతున్నారన్నారు. తెలంగాణలో దాదాపు 30వేల తండాలు, కోయగూడాలు, చెంచుపెంటలను గ్రామ పంచాయతీలుగా చేసి మా ప్రాంతాలను మేమే పాలించుకునే అవకాశం కల్పించారన్నారు. నేను సర్పంచ్‌గా చేసిన గ్రామంలోని తండాలు కూడా నేడు గ్రామ పంచాయతీలుగా మారి గిరిజనులు అక్కడ సర్పంచ్ లు అయ్యారంటే అది ముఖ్యమంత్రి కేసీఆర్ ఘనతే అన్నారు. గురుకులాల్లో నాణ్యమైన విద్యతో పాటు సన్నిబియ్యంతో అన్నం పెడుతున్న గొప్ప నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. తన చిన్నతనంలో తండాలో బడి లేకపోతే తన తల్లిదండ్రులు హాస్టల్ లో వేశారని, అయితే అక్కడ ముక్క బియ్యం, దొడ్డు బియ్యంతో అన్నం పెడితే అది తినలేక బడినుంచి పారిపోయి వచ్చానని, దాంతో చిన్నతనంలోనే తనకు పెళ్లి చేశారని చెప్పారు. కానీ సీఎం కేసీఆర్ ఈ సమస్యను గుర్తించి గురుకులాలను ఏర్పాటు చేసి అక్కడ అన్ని వసతులు కల్పించి, సన్నబియ్యంతో అన్నం పెడుతున్నారని తెలిపారు. సాధారణ గిరిజన కుటుంబంలో పుట్టిన నాకు నేడు మంత్రి పదవి ఇచ్చి, తెలంగాణ కేబినెట్‌లో తొలి మహిళా మంత్రిని చేసిన మహానుభావుడు కేసీఆర్ అన్నారు. ఇతర పార్టీలలో మంత్రి కావాలంటే పెద్ద లాబీయింగ్ ఉండాలని, గాడ్ ఫాదర్ లు కావాలని, ఇక్కడ అవేవి లేకుండా సామాన్య గిరిజన కుటుంబం నుంచి వచ్చిన తనకు మంత్రి పదవి ఇచ్చి, గిరిజనులకు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారో చేసి చూపినందుకు ఆయనకు పాదాభివందనాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ దఫేదార్ శోభరాజు, ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యేలు హన్మంత్ షిండే, జాజుల సురేందర్, ఎస్సీ, ఎస్టీ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్, జిల్లా కలెక్టర్ సత్యనారాయణ, ఇతర అధికారులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

ప్రజల మంచినీటి అవసరాలు తీర్చేందుకే మిషన్ భగీరథ

ఖర్చుకు వెనకాడకుండా పథకం అమలు
దేశవ్యాప్తంగా దీనిని అమలు చేయాల్సి ఉంది
కేంద్ర జల్‌శక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో కేసీఆర్

హైదరాబాద్,నవంబర్12(ఆర్ఎన్ఎ): మిషన్ భగీరథతో ఇంటింటికీ నీరు అందించే మహత్తర కార్యక్రమం తెలంగాణలో నడుస్తోందని సిఎం కెసిఆర్ అన్నారు. ప్రజలకు కనీస అవసరమైన మంచినీటి అవసరాన్ని గుర్తించిన ప్రభుత్వం ఖర్చుకు వెనకాడకుండా దీనిని చేపట్టిందన్నారు. ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌తో కేంద్ర జల్‌శక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ సమావేశమయ్యారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ గురించి సీఎం కేసీఆర్‌ను గజేంద్రసింగ్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్, ఉన్నతాధికారులు భగీరథ పథకంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. మిషన్ కాకతీయ పథకం గురించి కూడా కేంద్రమంత్రికి ముఖ్యమంత్రి వివరించారు. 90శాతం ఆయకట్టు కలిగిన చెరువులను బాగు చేసినట్లు సీఎం వివరించారు. రాష్ట్రంలో మిషన్ భగీరథ పథకం దాదాపుగా పూర్తయ్యిందని అన్నారు. 24వేల ఆవాస ప్రాంతాలకు రోజూ ఉపరితల జలాలను అందించనున్నట్లు వెల్లడించారు. వచ్చే 30ఏండ్ల వరకు జనాభా అవసరాలు తీర్చేలా ప్రాజెక్టు రూపకల్పన చేశామన్నారు. మిషన్ భగీరథ వంటి పథకం దేశమంతా అమలైతే మంచిది. ప్రజలకు మంచినీరు అందించే పథకాలను ఆర్థిక కోణంలో చూడొద్దన్న లక్ష్యంతో దీనిని చేపట్టామని అన్నారు. మిషన్ భగీరథ పథకానికి, దాని నిర్వహణకు కేంద్రం ఆర్థిక సహకారం అందించాలని'సీఎం కేసీఆర్ ఈ సందర్భంగా కేంద్రమంత్రిని కోరారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పథకాలను కేంద్ర జల్‌శక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ప్రశంసించారు. త్వరలో మరోసారి తెలంగాణలో పర్యటించి క్షేత్రస్థాయిలో పథకాల అమలును స్వయంగా పరిశీలిస్తానని తెలిపారు. మిషన్ భగీరథ తరహాలో దేశవ్యాప్తంగా మంచినీటి పథకం అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోందన్నారు. రాష్ట్రాల భాగస్వామ్యంతో మంచినీటి పథకాలు అమలు చేస్తాం. మురుగు నీటిని శుద్ధిచేసి తిరిగి వినియోగించే విధానాలు కూడా అవలంబించాలి. క్షేత్రస్థాయిలో పర్యటించి మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాల అమలును పరిశీలిస్తాని' షెకావత్ పేర్కొన్నారు. అనంతరం కేంద్రమంత్రికి జ్ఞాపికను బహూకరించి, శాలువాతో సీఎం కేసీఆర్ సన్మానించారు.

ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా మొక్కను నాటిన కేంద్ర జల శక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్.

కారుకు అడ్డం వచ్చాడని కిరాతకం

బాలుడిని చితకబాదిన వ్యక్తి

హైదరాబాద్,నవంబర్12(ఆర్ఎన్ఎ): సికింద్రాబాద్ సమీపంలోని అల్వాల్‌లో అమానుష ఘటన చోటుచేసుకుంది. కారుకు అడ్డువచ్చాడని ఓ బాలుడిని క్రాంతి స్వరూప్ అనే వ్యక్తి తీవ్రంగా కొట్టాడు. బాలుడు బోరున విలపించినా కనికరం చూపకుండా దారుణంగా వ్యవహరించాడు. లిఫ్ట్‌లోకి తీసుకెళ్లి విక్షణారహితంగా బాదాడు. ఈ ఘటన అల్వాలోని సువర్ణ అపార్ట్‌మెంట్‌లో సోమవారం జరిగింది. క్రాంతి స్వరూప్ దుర్మార్గమంతా అపార్టమెంట్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. తీవ్ర గాయాల పాలైన బాలుడిని దగ్గరలోని ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. క్రాంతి స్వరూప్‌పై బాలుడి తండ్రి సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

శివసేన సర్కార్ ఏర్పాటుకు తొలగిని అడ్డంకులు

మద్దతు ఇచ్చేందుకు కాంగ్రెస్ అధినేత్రి సోనియా నిర్ణయం

ముంబై,నవంబర్12(ఆర్ఎన్ఎ): మహారాష్ట్రలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ఎన్సీపీ-కాంగ్రెస్‌తో కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసేందుకు శివసేన వేగంగా పావులు కదుపుతోంది. ఇప్పటికే సేనకు మద్దతునిచ్చేందుకు ఎన్సీపీ అంగీకరించగా.. తాజాగా కాంగ్రెస్ పార్టీ కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కాంగ్రెస్ పార్టీ తాత్కాలిక అధ్యక్షురాలు సోనియాగాంధీ ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు.

శివసేన ప్రభుత్వానికి బయటి నుంచి మద్దతునివ్వాలని ఆమె నిర్ణయం తీసుకున్నట్టు విశ్వసనీయంగా తెలుస్తోంది. దీంతోమహారాష్ట్ర రాజకీయాల్లో గత కొద్దిరోజులుగా నెలకొన్న ఉత్కంఠకు తెరపడనుంది.

కాంగ్రెస్ పార్టీ శివసేనకు మద్దతు తెలిపడంతో పాటు బయట నుంచి ప్రభుత్వానికి మద్దతు ఇచ్చేందుకు సోనియా గాంధీ అంగీకరించారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీతో భేటీ అయ్యి శివసేనకు మద్దతు అంశంపై చర్చించారు. ప్రభుత్వానికి బయటనుంచి మద్దతివ్వాలని నిర్ణయించారు. ఇప్పటికే నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) శివసేనకు మద్దతు ఇస్తానని ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా కాంగ్రెస్ కూడా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో శివసేన- ఎన్సీపీ ప్రభుత్వం ఏర్పాటుకు లైన్ క్లియర్ అయింది. అంతకుముందు సోనియాగాంధీ నివాసంలో పార్టీ అగ్రనాయకులు భేటీ అయి.. మహారాష్ట్ర పరిణామాలు, శివసేన సంకీర్ణ ప్రభుత్వానికి మద్దతునిచ్చే అంశంపై చర్చించారు. సోనియా అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో ఏకే ఆంథోని, అహ్మద్ పటేల్ వంటి అగ్రనేతలు పాల్గొన్నారు. ఈ భేటీ జరుతుండగానే శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే సోనియాగాంధీకి ఫోన్ చేసి మాట్లాడారు. శివసేన ప్రభుత్వానికి మద్దతునివ్వాల్సిందిగా ఈ సందర్భంగా సోనియాను ఠాక్రే కోరారు. అయితే, సేనతో చేతులు కలిపే విషయంలో కాంగ్రెస్ అధినాయకత్వం అంత సుముఖంగా లేకపోయినా.. మహారాష్ట్ర పీసీసీ ఒత్తిడికి తలొగ్గి.. సేనకు మద్దతునిచ్చినట్టు తెలుస్తోంది. మరోవైపు గవర్నర్ ఆహ్వానం మేరకు శివసేన నేతలు ఆదిత్య ఠాక్రే, ఏక్‌నాథ్ షిండే గవర్నర్‌ను కలిసి వారి ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతి కోరనున్నారు. ఇక, శివసేన-ఎన్సీపీ-కాంగ్రెస్ కూటమిపై బీజేపీ చిటపటలాడుతోంది. ఒకప్పుడు బాబా సాహెబ్ సేనగా ఉన్న శివసేన ఇప్పుడు సోనియా సేనగా మారిపోయిందంటూ బీజేపీ నేత మినాక్షి లేఖి ట్విటర్‌లో వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

బిఎస్ఎన్‌లో విఆర్ఎస్ అమలు

70 వేల మంది ఉద్యోగుల దరఖాస్తు

న్యూఢిల్లీ,నవంబర్12(ఆర్ఎన్ఎ): కష్టాల ఊబిలో ఉన్న భారత ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ తమ ఉద్యోగస్తులకు వీఆర్ఎస్ ఆఫర్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే దాదాపు 70వేల మంది బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు వాలంటరీ రిటైర్‌మెంట్ స్కీమ్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు బీఎస్ఎన్ఎల్ ఛైర్మన్, ఎండీ పీకే పువార్ తెలిపారు. గతవారమే వీఆర్ఎస్ ఆఫర్‌ను బీఎస్ఎన్ఎల్ ప్రకటించింది. మొత్తంగా లక్ష మందికి వీఆర్ఎస్ ప్రకటించాలని బీఎస్ఎన్ఎల్ భావించింది. గతవారం వీఆర్ఎస్ ఆఫర్‌ను ప్రకటించగానే ఇప్పటి వరకు 70వే మంది వీఆర్ఎస్ కావాలంట

పాస్‌పోర్టుకు అప్లై చేస్తున్నారా..? ఈ సైట్లతో జాగ్రత్త..!

హైదరాబాద్, నవంబర్ 12ప్రస్తుత తరుణంలో ఇంటర్నెట్ ప్రపంచంలో ఎక్కడ చూసినా నకిలీ సైట్లు, యాప్‌లు రాజ్యమేలుతున్నాయి. వాటి బారిన పడి ఎంతో మంది ఎన్నో విధాలుగా నష్టపోతున్నారు. అనేక మంది డబ్బును నష్టపోవడమే కాకుండా వారి వ్యక్తిగత సమాచారం కూడా చోరీకి గురవుతోంది. ఈ క్రమంలోనే అలాంటి నష్టం జరగకుండా ఉండేందుకు గాను ముందు జాగ్రత్త చర్యగా పాస్‌పోర్టులకు అప్లై చేసే వారిని కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ హెచ్చరిస్తోంది.పాస్‌పోర్టుకు అప్లై చేసే వారు లేదా పాస్‌పోర్టు రెన్యువల్ చేసుకునే వారు ఆన్‌లైన్‌లో పాస్‌పోర్టు సైట్ లేదా స్మార్ట్‌ఫోన్ యాప్‌లో దరఖాస్తు పెట్టుకోవాల్సి ఉంటుందన్న సంగతి తెలిసిందే. అయితే ఇదే విషయాన్ని ఆసరాగా చేసుకున్న కొందరు పాస్‌పోర్టు అప్లై, రెన్యూ పేరిట నకిలీ సైట్లు, యాప్‌లను సృష్టించి ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారు. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించబడే passportindia.gov.in, portal2.passportindia.gov.in వెబ్‌సైట్లు, mPassport Seva అనే యాప్ తప్ప ఇతర ఏ సైట్, యాప్ జోలికి వెళ్లకూడదని సంబంధిత శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇక ప్రస్తుతం ఆన్‌లైన్‌లో చెలామణీలో ఉన్న పలు నకిలీ పాస్‌పోర్టు సైట్ల వివరాలు ఇలా ఉన్నాయి.

ndiapassport.org, onlinepassportindia.com, passportindiaportal.in, passport-india.in, passport-seva.in, applypassport.org తదితర నకిలీ పాస్‌పోర్టు సైట్లు ప్రస్తుతం నెట్‌లో అందుబాటులో ఉన్నాయని, వీటి పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

జగన్ కి యాంటీ సోషల్ పర్సనాలిటీ డిసార్డర్ వ్యాధి : బుద్దా వెంకన్న

విజయవాడ,నవంబర్12(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై టీడీపీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న ట్విటర్ వేధికగా విరుచుకుపడ్డారు. ఆయన యాంటీ సోషల్ పర్సనాలిటీ డిసార్డర్ అనే మానసిక వ్యాధితో బాధపడుతున్నారని, అందుకే అలా ప్రవర్తిస్తున్నారని విమర్శలు చేశారు. అబద్దాలు చెప్పడం, చట్టాన్ని ఉల్లంఘించడం, ప్రజల్ని దోచుకోవడం, విధ్వంసం ఈ వ్యాధి లక్షణాలుగా పేర్కొన్నారు. డెంగ్యూతో ప్రజలు చనిపోతుంటే సంబరాలు చేసుకోవడం, ఇసుక లేక భవన నిర్మాణ కార్మికుల ఆత్మహత్యలపై జోకులు వేయడం వంటి దుర్లక్షణాలన్నీ ఈ వ్యాధి లక్షణాలేనని బుద్దా వెంకన్న పేర్కొన్నారు

ఆస్పత్రిలో చేరిన శివసేన ఎంపీ సంజయ్ రౌత్

ముంబై,నవంబర్12(ఆర్ఎన్ఎ): శివసేన సీనియర్ నేత, ఎంపీ సంజయ్ రౌత్ సోమవారం ఆస్పత్రి పాలయ్యారు. కాలు నొప్పితో బధపడుతున్న ఆయనను ముంబైలోని లీలావతి ఆసుపత్రిలో చేర్పించినట్టు తెలుస్తోంది. మరో మూడు రోజులు ఆయన ఆస్పత్రిలోనే చికిత్స పొందుతారని, చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారని కుటుంబసభ్యులు చెప్తున్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం శివసేన నేత సంజయ్‌రౌత్ దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యమంత్రి పదవిని చెరిసగం పంచాల్సిందేనని ఆయన బీజేపీకి అల్టిమేటం ఇచ్చారు. అందుకు బీజేపీ ఒప్పుకోకపోవడంతో ఎన్సీపీ, కాంగ్రెస్‌తో కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు శివసేన సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే. శివసేన అధినాయకత్వం వ్యూహాలకు అనుగుణంగా అటు బీజేపీని ఇరకాటంలో పెడుతూ.. ఇటు ఎన్సీపీ, కాంగ్రెస్‌లతో పొత్తుకు లైన్ క్లియర్ చేయడంలో సంజయ్ రౌత్ కీలక పాత్ర పోషించారు. ఒకవైపు శివసేన కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు చకచకా అడుగులు వేస్తుండగా.. మరోవైపు ఆయన ఆస్పత్రి పాలుకావడం పార్టీ శ్రేణులను కొంత నిరాశకు గురిచేసింది.

హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలకు పలు మినహాయింపులు రద్దు

ఆర్‌బిఐ నిర్ణయం

ముంబయి, నవంబర్ 12(ఆర్ఎన్ఎ) : గృహరుణ వ్యాపార సంస్థలకు (హౌసింగ్ ఫైనాన్సింగ్ కంపెనీలు) అందజేస్తున్న కొన్ని రకాల మినహాయింపులను ఆర్‌బీఐ రద్దు చేసింది. నాన్‌బ్యాంకింగ్ ÷నాన్షియల్ సంస్థలతో సమానంగా వీటికి నిబంధనలను విధించింది. ఫైనాన్స్ యాక్ట్ 2019లో మార్పులు చేసి నేషనల్ బ్యాంక్ చట్టం 1987ను సవరించిన తర్వాత ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకొంది. ఈ సవరణతో గృహరుణ వ్యాపార సంస్థల నిబంధనలను సవరించే అధికారం ఆర్‌బీఐ చేతికి వచ్చింది. ఇప్పటి వరకు ఈ సంస్థలకు 1934 ఆర్‌బీఐ చట్టంలోని చాప్టర్ ఐఐఐబీ నుంచి మినహాయింపు ఉంది. కానీ, తాజాగా ఆర్‌బీఐ నిర్వహించిన సమీక్షలో ఈ మినహాయింపును తొలగించాలని నిర్ణయించారు. దీంతో సదరు హెచ్ఎఫ్‌సీలు రుణాలను చెల్లించలేవని ఆర్‌బీఐ భావించినప్పుడు, లేదా ప్రజా ప్రయోజనాలకు భంగకరమని అనిపించినప్పుడు సదరు సంస్థను మూసివేయమని ఆదేశించవచ్చు. చట్టపరమైన ఏ నిబంధననైనా ఐదు రోజుల్లో పూర్తి చేయలేకపోతే అది రుణాలను చెల్లించలేదని ఆర్‌బీఐ భావిస్తుంది. దీంతోపాటు ఆయా సంస్థలు ఆర్‌బీఐకు సమర్పించిన నివేదికల్లోని అంశాలు సరైనవో కాదో తనిఖీ చేసే అధికారం కూడా లభిస్తుంది. దీంతోపాటు ఆయా హెచ్ఎఫ్‌సీలు ప్రతి ఏటా డివిడెండ్‌ను ప్రకటించడానికి ముందే కనీసం 20శాతం నిధులను రిజర్వు నిధికి తరలించాల్సి ఉంటుంది.

జులై 5న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బ్జడెట్‌లో ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 45-ఐఏ సవరణను ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలో గృహరుణ వ్యాపార సంస్థలను బ్యాంకేతర సంస్థలుగా ఆగస్టు 13న ఆర్‌బీఐ ప్రకటించింది. 'నియంత్రణ సౌలభ్యం కోసం ఇక నుంచి గృహరుణ వ్యాపార సంస్థలను నాన్ బ్యాంకింగ్ ÷నాన్షియల్ కంపెనీలు(ఎన్‌బీఎఫ్‌సీ)లుగా పరిగణిస్తాము. వీటికి వర్తించే నిబంధనలపై ఆర్‌బీఐ సమీక్ష నిర్వహించి అవసరమైన మార్పులు చేర్పులను చేస్తుంది' అని ఆర్‌బీఐ పేర్కొంది.

రైలు ప్రమాదంపై ఉన్నతస్థాయి కమిటీ

లోకోపైలెట్ పరిస్థతి విషమం

హైదరాబాద్, నవంబర్12(ఆర్ఎన్ఎ) :కాచిగూడ రైల్వే స్టేషన్‌లో సోమవారం జరిగిన రైలు ప్రమాదంపై సౌత్ సెంట్రల్ రైల్వే ముగ్గురు సభ్యులతో కూడిన హైలెవెల్ కమిటీని ఏర్పాటు చేసింది. బుధవారం ప్రమాదస్థలిని హైలెవెల్ కమిటీ పరిశీలించనున్నది.

ప్రమాదానికి గల కారణాలేమిటి? సిగ్నలింగ్ లోపం ఉందా..? లేక ఎంఎంటిఎస్ లోకోపైలెట్ నిర్లక్ష్యమా..?అనే విషయాలపై కమిటీ దృష్టిపెట్టనుంది. రైల్వే శాఖ ప్రాథమిక విచారణలో ఎంఎంటిఎస్ లోకోపైలెట్ నిర్లక్ష్యంగానే ప్రమాదం జరిగినట్లు తేలింది. అయితే పూర్తి స్థాయి విచారణ అనంతరం నివేదికను అందజేయనున్నారు.

ప్రమాదంలో క్యాబిన్‌లో చిక్కుకున్న ఎంఎంటీఎస్ లోకోపైలట్ చంద్రశేఖర్ ఆరోగ్యపరిస్థితి విషమంగా ఉందని, వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నామని కేర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.సుష్మ వెల్లడించారు. ఈ మేరకు ప్రమాదంలో గాయపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిపై మంగళవారం ఆమె హెల్త్ బులిటెన్ విడుదల చేశారు. లోకోపైలట్ చంద్రశేఖర్ రెండు కాళ్లకు రక్త ప్రసరణ తగ్గిందని, పక్కటెముకలు, మూత్రపిండం దెబ్బతిన్నాయని ఆమె తెలిపారు. అతడితోపాటు ప్రమాదంలో గాయపడిన శేఖర్, బేలేశ్వరమ్మ, రాజ్‌కుమార్, సాజిద్,మహ్మద్ ఇబ్రహీంకు వైద్యం అందిస్తున్నామని, వీరి ఆరోగ్య పరిస్తితి నిలకడగా ఉందని చెప్పారు.

లోకోపైలెట్‌పై కేసు నమోదు ప్రమాదానికి కారణమైన ఎంఎంటీఎస్ లోకోపైలట్ చంద్రశేఖర్‌పై రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. కాచిగూడ స్టేషన్ మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చంద్రశేఖర్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. లోకోపైలెట్ కోలుకున్నాక అతని నుంచి వాంగ్మూలం తీసుకోవాలని రైల్వే పోలీసులు భావిస్తున్నారు.

ఎపి ఔట్‌సోర్సింగ్ కార్పోరేషన్ ఏర్పాటు

50శాతం ఉద్యోగాలు మహిళలకే - సిఎం జగన్

అమరావతి,నవంబర్ 12(ఆర్ఎన్ఎ) : ఏపీ కార్పొరేషన్ ఫర్ ఔట్ సోర్స్‌డ్ ఎంఎ÷-లాయిన్ వెబ్‌సైట్‌ను ఏపీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. పొరుగుసేవల ఉద్యోగాలన్నింటినీ దీని పరిధిలోకి తీసుకొస్తామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. జీతం ఇచ్చేటప్పుడు ఉద్యోగులను మోసం చేయకుండా, మధ్యవర్తులను పూర్తిగా తొలగించాలన్న ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీఎం వివరించారు. పొరుగుసేవల ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన వారు 50 శాతం మంది ఉండాలని, అంతేకాకుండా జిల్లా స్థాయిలో 50 శాతం ఉద్యోగాలు మహిళలకే ఇవ్వాలని ఆయన అన్నారు. ఈ మేరకు ఆయా శాఖాధిపతుల కమిటీ నుంచి డిసెంబర్ 15 కల్లా ఉద్యోగాల జాబితా రావాలని, జనవరి 1 నుంచి నియామక ఉత్తర్వులు ఇవ్వాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు.

రేపటి నుంచి ఇసుక వారోత్సవాలు

నవంబర్ 14 నుంచి నవంబర్ 21 వరకు ఇసుక వారోత్సవాలు నిర్వహించాలని ఏపీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిర్ణయించారు. గతంలో సరాసరి ఇసుక డిమాండ్ 80 వేల టన్నులు ఉందని, వరదల కారణంగా రీచ్‌లు మునిగిపోవడంతో డిమాండ్‌ను చేరుకోలేకపోయామన్నారు. 13 జిల్లాల కలెక్టర్లతో మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. గత వారం రోజులుగా పరిస్థితి మెరుగుపడిందన్న సీఎం.. ప్రస్తుత సరఫరా 1.2 లక్షల టన్నులకు పెరిగిందన్నారు. వినియోగంలోకి వచ్చిన రీచ్‌ల సంఖ్య 60 నుంచి 90కి వచ్చినట్లు చెప్పారు.

అద్దె విమానంలో తేజస్వీ యాదవ్ బర్త్ డే వేడుకలు

-సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు

పాట్నా, నవంబర్12(ఆర్ఎన్ఎ): ఆర్జేడీ అధినేత, మాజీ సీఎం లాలు ప్రసాద్ యాదవ్ కుమారుడు తేజస్వీ యాదవ్ పుట్టినరోజు వేడుకను విలాసవంతంగా జరుపుకోవడం వివాదాస్పదంగా మారింది. రాజు ఈ నెల 9న తన 30వ పుట్టిన రోజు వేడుకలను ప్రత్యేకమైన చార్టర్డ్ విమానంలో జరుపుకున్నారు. బర్త్‌డే సెలబ్రేషన్ ఫోటోలను రాంచీలోని రాక్ గార్డెన్ రిసార్ట్ డైరెక్టర్ సిద్దాంత్ సుమన్ తన ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు.

ఈ వేడుకల ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో తేజస్వీ యాదవ్‌ను పలువురు నేతలు విమర్శలు గుప్పించారు. జేడీయూ అధికార ప్రతినిధి సంజయ్ సింగ్ మాట్లాడుతూ.. పేద ప్రజల అభ్యున్నతి గురించి మాట్లాడే.. తేజస్వీ యాదవ్ విలాసవంతంగా చార్టర్డ్ విమానంలో పుట్టినరోజు జరుపుకున్నారు. అలా విమానాల్లో వేడుకలు జరుపుకోవడానికి బిల్లులు ఎవరు చెల్లించారని దుయ్యబట్టారు. కేక్ అందిస్తున్న సిద్దాంత్ సుమన్ ఎవరని ప్రశ్నించారు. ఆర్జేడీ నేతలు పేదలు, అణచివేతకు గురైన వారిపట్ల మొసలి కన్నీళ్లు పెట్టుకుంటారని ఆయన ఆరోపించారు. ఎప్పుడూ పేదల నుంచి భూమిని లాక్కుని, అవినీతి కేసులకు పాల్పడుతారని విమర్శించారు. ఓ వైపు తండ్రి లాలు ప్రసాద్ యాదవ్ ఆరోగ్యం బాగాలేదనే ఆందోళన కొంచం కూడా లేకుండా తేజస్వీ యాదవ్ తన పుట్టినరోజు వేడుకలు ఆకాశంలో జరుగుపుకోవడానికి సిగ్గుచేటు అని సంజయ్‌సింగ్ తీవ్రంగా విమర్శించారు. దీనిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కాగా, ప్రజా జీవితంలో ఇలాంటి విపరీత జీవనశైలిని నివారించాలని, ఈ సంఘటన పార్టీకి సమస్యలు కలిగించిందని కొందరు ఆర్జేడీ నేతలు అభిప్రాయపడ్డట్లు తెలుస్తోంది. అయితే తేజస్వీ యాదవ్ మాత్రం ఇప్పటివరకూ దీనిపై స్పందించలేదు.

మహారాష్ట్రలో రాష్ట్రపతి పాలనేనా..?

ముంబయి,నవంబర్ 12: మహారాష్ట్రలో రాష్ట్రపతి పాలన విధించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు ఏ పార్టీకీ స్పష్టమైన మెజార్టీ లేకపోవడంతో రాష్ట్రంలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ.. సరైన సంఖ్యాబలం లేకపోవడంతో ప్రభుత్వం ఏర్పాటు చేయలేమని గవర్నర్‌ను కలిసి తెలిపారు. ప్రభుత్వ ఏర్పాటు కావాల్సిన మేజిక్ ఫిగర్ 145. కానీ బీజేపీకి 105 స్థానాలు మాత్రమే వచ్చాయి.

కేంద్రానికి గవర్నర్ సిఫార్సు!

మహారాష్ట్రలో రాష్ట్రపతి పాలన విధించేందుకు కేంద్రానికి ఆ రాష్ట్ర గవర్నర్ భగత్ సింగ్ కోశ్యారీ సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. న్యాయవరమైన అంశాలను గవర్నర్ పరిశీలిస్తున్నారు. కాసేపటి క్రితం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో కూడా ఈ అంశంపై చర్చించినట్లు సమాచారం. మొత్తానికి ఈ రోజు సాయంత్రం వరకు మహారాష్ట్రలో కొనసాగుతోన్న ప్రతిష్టంభనకు తెరపడే అవకాశం ఉంది.

అప్రమత్తమైన శివసేన

మహారాష్ట్రలో రాష్ట్రపతి పాలన విధిస్తారని వార్తలు ఊపందుకున్న నేపథ్యంలో శివసేన పార్టీ అప్రమత్తమైంది. ఒక వేళ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధిస్తే సుప్రీంకోర్టుకు వెళ్లేందుకు శివసేన సిద్ధమవుతుంది. ఈ నేపథ్యంలో సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ ను సలహా కోరినట్లు తెలుస్తోంది. శివసేనదే సీఎం పీఠమని ఆ పార్టీ నేతలు తేల్చిచెబుతున్న విషయం విదితమే.

ఎన్సీపీకి గడువు రాత్రి 8:30 వరకే

నిన్న శివసేనకు గడువు విధించిన గవర్నర్ కోశ్యారీ ఇవాళ నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ)కి విధించారు. బీజేపీ, శివసేన ప్రభుత్వ ఏర్పాటుకు ముందుకు రాకపోవడంతో.. ఎన్సీపీని గవర్నర్ ఆహ్వానించారు. మంగళవారం రాత్రి 8:30 గంటల వరకు ఎన్సీపీకి గవర్నర్ గడువిచ్చారు. ఈ నేపథ్యంలో శరద్ పవార్ సోనియాతో మాట్లాడారు. ఇక కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్లికార్జున్ ఖర్గే, కేసీ వేణుగోపాల్, అహ్మద్ పటేల్ ముంబయికి పయనమయ్యారు. ఈ రోజు సాయంత్రం శరద్ పవార్ తో పాటు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులతో వారు చర్చించనున్నారు.

లిఫ్ట్ రాకముందే తెరుచుకున్న తలుపు..

కిందపడి యువకుడు మృతి

విజయవాడ,నవంబర్12(ఆర్ఎన్ఎ): లిఫ్ట్ రాకముందే అందులోకి వెళ్లేందుకు ప్రయత్నించిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు ఐదో అంతస్తు నుంచి కిందపడి ప్రాణాలు కోల్పోయాడు. విజయవాడలోని గవర్నర్‌పేటలో జరిగిందీ ఘటన. పోలీసుల కథనం ప్రకారం.. షేక్ ఇర్ఫాన్ అనే యువకుడు బందరు రోడ్డులోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నాడు. ఈ ఉదయం కిందికి దిగేందుకు లిఫ్ట్ వద్దకు వచ్చి బటన్ నొక్కాడు. ఆ వెంటనే తలుపు తెరుచుకుంది. అయితే, అప్పటికి లిఫ్ట్ రాకపోవడంతో లోపలికి అడగుపెట్టిన వెంటనే అమాంతం కిందపడిపోయాడు. ఐదో అంతస్తు నుంచి పడడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోను ఢీకొన్న బైక్.. యువకుడి తీవ్ర గాయాలు

ఒంగోలు,నవంబర్12(ఆర్ఎన్ఎ): ఆటోను వెనుక నుండి బైక్ ఢీకొనడంతో బైక్ పై ఉన్న యువకుడికి తీవ్రగాయాలైన ఘటన మంగళవారం ప్రకాశం అద్దంకిలో చోటు చేసుకుంది. మండలంలోని చక్రాయపాలెం సమీపంలో చిన్న కొత్తపల్లి గ్రామానికి చెందిన శివప్రసాద్ పట్నంలోకి బైక్‌పై వస్తుండగా.. ముందు వెళుతున్న ఆటోకు కుక్క అడ్డురావడంతో ఆటో నెమ్మదైంది. ఆటో వెనుక వస్తున్న బైక్ ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న యువకుడి కాలు చేతికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 లో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు రిమ్స్‌కు తరలించారు.

యాహూ గ్రూప్స్‌ను నిలిపివేయనున్న యాహూ.. డేటా డౌన్‌లోడ్‌కు యూజర్లకు అవకాశం..

హైదరాబాద్, నవంబర్ 12:ప్రముఖ సెర్చ్ ఇంజిన్ కంపెనీ యాహూ తన గ్రూప్స్ సేవలను ఇకపై నిలిపివేయనున్నట్లు ప్రకటించింది. ఆ సేవలను ఇక ఎంత మాత్రం కొనసాగించలేమని స్పష్టం చేసింది. అయితే గ్రూప్స్‌ను ఇప్పటికే వాడుతున్న యూజర్లు తమ డేటాను డౌన్‌లోడ్ చేసుకుందుకు యాహూ అవకాశం కల్పించింది. డిసెంబర్ 14వ తేదీ వరకు అందుకు గడువు ఇచ్చింది. యూజర్లు యాహూ గ్రూప్స్‌లోని ప్రైవసీ డ్యాష్‌బోర్డ్‌కు వెళ్లి తమ డేటాను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని యాహూ తెలిపింది. అయితే ప్రస్తుతానికి యాహూ గ్రూప్స్‌లో కంటెంట్ అప్‌లోడింగ్‌ను కూడా నిలిపివేశారు.

కాగా 2001లో ప్రారంభమైన యాహూ గ్రూప్స్ ఒకప్పుడు నెటిజన్లకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఒకే అభిరుచులు కలిగిన ఇంటర్నెట్ వినియోగదారులు తమ భావాలను పంచుకునేందుకు వేదికగా నిలిచిన యాహూ గ్రూప్స్ ఇక కనుమరుగు కానుండడంతో పలువురు యూజర్లు విచారం వ్యక్తం చేస్తున్నారు.

వారాంతాల్లో గుండె పోటు వస్తే బతికే అవకాశం తక్కువ..

పరిశోధనలో వెల్లడి..!



హైదరాబాద్,నవంబర్ 12ప్రపంచవ్యాప్తంగా ఏటా అనేక మంది గుండెపోటు కారణంగా చనిపోతున్నారు. చాలా మంది మొదటిసారి గుండెపోటు వచ్చినప్పుడు ప్రాణాలు నిలుపుకోగలిగినా.. జీవితాంతం మళ్లీ ఆ సమస్య రాకుండా చూసుకోవడం అనివార్యమైంది.

అయితే సోమవారం నుంచి శుక్రవారం వరకు ఏ రోజులోనైనా సరే.. గుండెపోటు వచ్చిన వారితో పోలిస్తే శని, ఆది వారాల్లో గుండె పోటు వచ్చిన వారు బతికే అవకాశాలు చాలా తక్కువని సైంటిస్టులు చేపట్టిన పరిశోధనల్లో వెల్లడైంది.

ఫిలడెల్ఫియాలో ఇటీవల జరిగిన అమెరికన్ హార్ట్ అసోసియేషన్ రీససిటేషన్ సైన్స్ సింపోజియం 2019 సదస్సులో యూకేకు చెందిన పలువురు పరిశోధకులు సర్వైవల్-టు-హాస్పిటల్ అడ్మిషన్ అనే అంశంపై చేపట్టిన పరిశోధనకు చెందిన వివరాలను వెల్లడించారు.

అందుకుగాను వారు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 3వేల మందికి చెందిన డేటాను సేకరించి విశ్లేషించారు. ఈ క్రమంలో వచ్చిన ఫలితాలను బట్టి సైంటిస్టులు చెబుతున్నదేమిటంటే..

ఇతర రోజుల్లో కన్నా శనివారం రాత్రి 12 నుంచి ఆదివారం మధ్యాహ్నం 12 గంటల మధ్య గుండె పోటు వచ్చిన వారిలో కేవలం 20 శాతం మంది మాత్రమే బతికారని వెల్లడైంది. ఇక వయస్సు పెరిగే కొద్దీ ఈ శాతం మరింత తగ్గుతుందని వారు తెలిపారు.

ప్రాణాలు తీసిన మొబైల్.. ఛార్జింగ్‌లో ఉండగా పేలుడు

భువనేశ్వర్,నవంబర్12(ఆర్ఎన్ఎ): స్మార్ట్ ఫోన్ల విషయంలో జాగ్రత్తగా లేకపోతే ప్రాణాలే పోతాయనటానికి ఇది. స్మార్ట్ ఫోన్ చార్జింగ్‌లో ఉండగా పేలిన మొబైల్ ఫోన్ ఒకయువకుడి ప్రాణాలుతీసింది. ఒడిశాలోని పారాడిప్‌లో ఈ విషాదం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే..భవన నిర్మాణ కార్మికుడైన కునా ప్రధాన్ (22) తన ఫోన్‌కు చార్జింగ్ పెట్టి, మరో ముగ్గురు కార్మికులతో పాటు గదిలో నిద్రిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పారాడిప్ పోలీస్ స్టేషన్ అధికారిక ఆర్‌కె సమల్ అందించిన సమాచారం ప్రకాచరం చార్జింగ్‌లో ఉన్న స్మార్ట్‌ఫోన్ ఒక్కసారిగా పేలడంతో ప్రధాన్ అక్కడిక్కడే చనిపోయాడు. సమాచారం తెలియగానే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టంకోసం ఆసుపత్రికి తరలించారు. బాధితుడిని నాయగర్ జిల్లాలోని రాణ్‌పూరి ప్రాంతానికి చెందినవాడిగా గుర్తించారు. ట్రక్ యజమానుల సంఘం చేపట్టిన పారదీప్‌లో ఆలయ నిర్మాణ పనుల్లో కార్మికుడిగా పనిచేస్తున్నాడు.

రూ.300 కోట్ల మోసం..జ్యువెలరీ షోరూం ఓనర్స్ అరెస్ట్

ముంబై,నవంబర్ 12: ఛీటింగ్ కేసులో ముంబై పోలీసులు జ్యువెలరీ షోరూం యజమానులను అరెస్ట్ చేశారు. ఇద్దరు సోదరులు జయేశ్ రసిక్ లాల్ షా, నీలేశ్ రసిక్ లాల్ షా సబర్బన్ ఘాట్‌కోపర్ లో జ్యువెలరీ షోరూం నిర్వహిస్తున్నారు. తమ షోరూంలో నగదు డిపాజిట్లు చేస్తే మంచి రాబడి వస్తుందని కస్టమర్లను నమ్మించారు. జ్యువెలరీ షాపు యజమానులు వివిధ స్కీంలు పెట్టి అందరినీ ఆకర్షించారు. వారి మాటలు నమ్మి చాలా మంది నగదు డిపాజిట్లు చేశారు.

అయితే అక్టోబర్ 28న సదరు జ్యువెలరీ షోరూం మూతపడి ఉన్నట్లు గుర్తించిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. మరోవైపు జ్యువెలరీ సిబ్బంది తమకు ఆరు నెలల నుంచి జీతాలు ఇవ్వలేదని లేబర్ డిపార్ట్‌మెంట్‌ను ఆశ్రయించారు. యజమానులిద్దరిపై ఐపీఎస్ సెక్షన్ 420, 406 కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని ఎకనమిక్ అఫైర్స్ వింగ్ పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. సుమారు 300 కోట్ల మేర మోసానికి పాల్పడినట్లు ప్రాథమికంగా భావిస్తున్నట్లు తెలిపారు.

గ్రీన్ ఇండియా ఛాలెంజ్.. మొక్కలు నాటిన ఎన్నారై ఫ్రాన్స్ అధ్యక్షులు..

హైదరాబాద్,నవంబర్ 12: టీఆర్ఎస్ నాయకులు, రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ ప్రారంభించిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో భాగంగా టీఆర్ఎస్ ఎన్నారై కోఆర్డినేటర్ మహేష్ బిగాల గారు ఇచ్చిన చాలెంజ్ ను ఎన్నారై ఫ్రాన్స్ అధ్యక్షులు శ్రీనివాస్ స్వీకరించారు. ప్యారిస్ లో శ్రీనివాస్ మూడు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాజ్యసభ సభ్యులు సంతోష్ ఒక మంచి గొప్ప కార్యక్రమాన్ని చేపట్టారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో తనను భాగస్వామ్యం చేయడం చాలా సంతోషకరమని చెప్పారు. సంతోష్ కు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. ఫ్రాన్స్ లో ఉన్న తన మిత్రులను కూడా గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కార్యక్రమంలో పాల్గొనాలని ఆహ్వానించినట్లు శ్రీనివాస్ పేర్కొన్నారు.

మన్యం బంద్

గిరిజనుల నిరసన ర్యాలీ

గిరిజన సంఘం నాయకులు అరెస్ట్

విజయనగరం,నవంబర్12(ఆర్ఎన్ఎ): అటవీ హక్కుల రక్షణకుగాను.. గిరిజన సంఘం ఆధ్వర్యంలో పలు చోట్ల చేపట్టిన మన్యం బంద్ మంగళవారం కొనసాగుతోంది. మంగళవారం ఉదయం మండలంలోని నీలకంటాపురం కేంద్రంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలంటూ.. గిరిజన సంఘం నాయకులు అడ్డుమేశ్వరరావు, వెంకట్రావు, సోగన్నా గణపతిల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. కురుపాం మండలంలోని నీలకంఠపురం లో గిరిజన సంఘం నాయకులు అడ్డు మహేశ్వరరావు, వెంకట్రావు, శోగన్నా ల ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా గుమ్మలక్ష్మీపురం రూరల్‌లో నిరసన కొనసాగింది.

ఈ నేపథ్యంలో.. మన్యం ప్రాంతాల్లో బందు చేస్తున్న ఎపి గిరిజన సంఘం నాయకులను అరెస్ట్ చేసి ఎల్విన్ పేట పోలీస్ స్టేషన్ కు గుమ్మలక్ష్మీపురం రూరల్ పోలీసులు తరలించారు.

రెండోరోజూ పంచాయితీ కార్మికుల సత్యాగ్రహ దీక్ష

గుంటూరు,నవంబర్12(ఆర్ఎన్ఎ):: గుంటూరు కలెక్టరేట్ ఎదుట పంచాయతీ కార్మికులు చేపట్టిన సత్యాగ్రహ దీక్ష మంగళవారం రెండో రోజు కొనసాగింది. పంచాయతీ కార్మికులకు రూ.18 వేల వేతనాన్ని అమలు చేయాలని, పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని, పంచాయతీ ఆదాయంతో సంబంధం లేకుండా ప్రభుత్వమే ప్రతినెలా వేతనాలను చెల్లించాలనే తదితర డిమాండ